


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 67, పేజీలు - 08

ఆదివారం, ఆగష్టు 10, 2025 వెల: 5 రూ./.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## ట్రంప్-పుతిన్ చర్చలను స్వాగతించిన భారత్

### - అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య కీలక సమావేశం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఆగస్ట్ 15న అలస్కాలో ఈ భేటీ జరగనున్నట్లు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. గత కొంతకాలంగా ఉద్రిక్తంగా ఉన్న ఉక్రెయిన్ యుద్ధానికి 2లో..

## చిన్నారులు, బ్రహ్మకుమారీలతో రక్షాబంధన్ వేడుకలు

### - మోదీకి రాఖీలు కట్టి ఆప్యాయత పంచిన చిన్నారులు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సోదరసోదరీ అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిన్నారుల ఆప్యాయతల మధ్య ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. శనివారం నాడు ఢిల్లీలోని తన అధికారిక నివాసం నెం.7, లోక్ కల్యాణ్ మార్గ్‌లో జరిగిన ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థులు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2లో..

## కశ్మీర్‌లో చారిత్రాత్మక ఘట్టం

### - అనంతనాగ్ చేరుకున్న తొలి గూడ్స్ రైలు



శ్రీనగర్ (ప్రశ్న న్యూస్) జమ్మూకశ్మీర్ చరిత్రలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. తొలిసారిగా ఒక సరుకు రవాణా రైలు (గూడ్స్ రైలు) కశ్మీర్ లోయలోని అనంతనాగ్ పట్టణానికి చేరుకుంది. ఈ చారిత్రక పరిణామంతో, ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ 2లో..

# భాగ్యనగరం బాధలు తీరేదెప్పుడు.?

## చినుకు పడితే అల్లాడిపోతున్న జనం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అరగంట వాన పడితేనే భాగ్యనగరం వీధులు నదుల్లా మారిపోతున్నాయి. నడుము లోతు వరకూ నీరు చేరి, రోడ్లపై మాన్‌హోల్స్ ఎక్కడ ఉన్నాయో కూడా గుర్తుపట్టలేని పరిస్థితి. వర్షం పడుతుందంటే నగర ప్రజల హృదయాల్లో భయం పుడుతోంది "ఇంటికి సురక్షితంగా చేరతామో లేదో?" అన్న ఆందోళన. భాగ్యనగరం (హైదరాబాద్) వర్షాకాలంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా వర్షం పడినప్పుడు వీధులు నదుల్లా మారడం, నగర ప్రజలకు నిత్యకృత్యంగా మారాయి. అరగంట వానకే రోడ్లన్నీ నీటితో నిండిపోతున్నాయి, మాన్‌హోల్స్ కనిపించకుండా పోతున్నాయి. ట్రాఫిక్ జామ్‌లు గంటల తరబడి కొనసాగి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య ప్రతి వర్షాకాలంలో పునరావృతమవుతున్నా, దానికి శాశ్వత పరిష్కారం ఇంకా లభించలేదు.

### సమస్యకు మూల కారణాలు

ఈ దుస్థితికి అనేక కారణాలు ఉన్నాయి, హైదరాబాద్ నగరంలోని డ్రెయినేజీ వ్యవస్థ చాలా పాతది మరియు విస్తరిస్తున్న నగర అవసరాలకు సరిపోవడం లేదు. జనాభా పెరగడం, కొత్త ప్రాంతాలు అభివృద్ధి చెందడం వల్ల నీటి మళ్లింపు సరిగ్గా జరగడం లేదు. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నా, వాటికి అనుగుణంగా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. కాలక్రమేణా నాలాలు, చెరువుల చుట్టూ అక్రమ నిర్మాణాలు పెరిగి, సహజ నీటి ప్రవాహ మార్గాలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. వర్షాకాలానికి ముందు డ్రెయినేజీ క్లీనింగ్, రోడ్ల మరమ్మతులు చేస్తామనే వాగ్దానాలు అమలుకు నోచుకోవడం లేదు. దీనివల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి, వరదలు సంభవిస్తున్నాయి.



### శాశ్వత పరిష్కారాల ఆవశ్యకత

ప్రతి వర్షాకాలం భాగ్యనగరం మునిగిపోకుండా ఉండాలంటే తాత్కాలిక చర్యలకు బదులుగా శాశ్వత పరిష్కారాలను అమలు చేయాలి. నగర జనాభా, విస్తరణకు అనుగుణంగా ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించడం, పాత వ్యవస్థను పునరుద్ధరించడం అవసరం. నాలాలు, చెరువుల చుట్టూ ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి, సహజ నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించాలి. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి, తద్వారా భూగర్భ జలాల మట్టం కూడా పెరుగుతుంది.

భవిష్యత్ నగర అభివృద్ధి ప్రాజెక్టులలో డ్రెయినేజీ, నీటి పారుదల వ్యవస్థలను సమగ్రంగా చేర్చాలి.

భాగ్యనగరం అభివృద్ధి చెందాలంటే, ప్రాథమిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం తప్పనిసరి. వర్షం అంటే భయం కాకుండా, ఆనందం కలిగించే రోజు రావాలంటే, ఈ సమస్యలకు ఒక సమగ్ర పరిష్కారాన్ని కనుగొనడం అవసరం. లేకపోతే, వర్షాకాలంలో నగర ప్రజల కష్టాలు ఇలాగే కొనసాగుతాయి.

## కేంద్ర ఎన్నికల సంఘం

# సంచలనం

### - 334 పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) సంచలన నిర్ణయం తీసుకుంది. గత ఆరేళ్లుగా ఒక్క ఎన్నికలోనూ పోటీ చేయని 334 రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దేశ రాజకీయ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచే దిశగా ఈ నిర్ణయాన్ని పరిగణిస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా నిబంధనల ప్రకారం రిజిస్టర్ అయిన ప్రతి రాజకీయ పార్టీ నిరంతరం ఎన్నికల్లో పాల్గొనాలి. అయితే 2019 నుంచి ఇప్పటివరకు ఈ 334 పార్టీలు ఏ ఎన్నికలోనూ అభ్యర్థులను నిలబెట్టలేదని ఈసీ తెలిపింది. అంతేకాకుండా రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన చిరునామాలో వారి కార్యాలయాలు భౌతికంగా లేవని క్షేత్రస్థాయి 2లో..

## ఇది దేవుడు సృష్టించిన అద్భుతం

- మళ్లీ జన్మంటూ ఉంటే ఇక్కడే పుడతానన్న సీఎం చంద్రబాబు
- ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా పాడేరులో సీఎం చంద్రబాబు పర్యటన
- గిరిజనుల ఉద్యోగ రిజర్వేషన్లపై జీవో 3ను పునరుద్ధరిస్తామని కీలక ప్రకటన
- ఏజెన్సీలో రోడ్లు, తాగునీటి కోసం వేల కోట్ల నిధులు మంజూరు
- గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుకు నిర్ణయం



పాడేరు (ప్రశ్న న్యూస్) గిరిజనుల అభివృద్ధి రాష్ట్ర సమగ్ర వికాసానికి కీలకమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని లగిశపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి భారీ ప్యాకేజీ ప్రకటించారు. ఏజెన్సీ సమగ్రాభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పాడేరులో జరిగిన సభలో ప్రసంగించిన ఆయన, గిరిజనుల 2లో..

### విత‌ంతువులకు సోదరుడిగా..

## రాఖీ గిఫ్ట్

### - పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం



అమరావతి (ప్రశ్న న్యూస్) రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని పిఠాపురం ఆడపడుచులకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కానుకలు పంపించారు. పిఠాపురానికి చెందిన 1,500 మంది వితంతు మహిళలకు చీరలు పంపించారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన జనసైనికుల ద్వారా పవన్ కళ్యాణ్ ఈ కానుకలు 2లో..

## తెలంగాణలో మరో భారీ పెట్టుబడి

### - రూ.80 వేల కోట్లతో ఎన్టీపీసీ సిద్ధం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ ముందుకు వచ్చింది. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో సుమారు రూ.80,000 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఎన్టీపీసీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్ సింగ్ నేతృత్వంలోని బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేసింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన సమావేశంలో ఈ ప్రతిపాదనను వారు వివరించారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తికి ఉన్న అవకాశాలను ఎన్టీపీసీ 2లో..

### ట్యాపింగ్ చేయించలేదని

## ప్రమాణం చేస్తావా

### - కేటీఆర్‌కు బండి సంజయ్ సవాల్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై తప్పుడు ఆరోపణలు చేశారని కేటీఆర్ లీగల్ నోటీసులు ఇవ్వడంపై బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. నేను ఏం తప్పు చెప్పిన.? సాక్షాత్తు మీ చెల్లెలు కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని చెప్పారు కదా.? ఆమెకు లీగల్ నోటీసులిస్తారా.? రాధాకిషన్ రావు తన వాంగ్మూలంలో కేసీఆర్ చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశారని చెప్పారు కదా.? ఆ విషయం కోర్టు ముందుంది. ఆయనకు నోటీసులిస్తావా.? అసలు నోటీసులు ఇవ్వాలనుకుంటే కేసీఆర్, ఆయన కొడుకు ఎప్పటికీ జైల్లోనే ఉంటారని అన్నారు. వాళ్లు తిట్టని 2లో..

### ప్రభుత్వ భవనాలపై

## సోలార్ పవర్ ప్లాంట్స్

### - డిజైన్స్ పంపాలని కలెక్టర్లకు భట్టి విక్రమార్క ఆదేశాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గ్రామ పంచాయతీల నుంచి సెక్రటేరియట్ వరకు అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శనివారం నాడు ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో భట్టి విక్రమార్క 2లో..

### అంతర్జాతీయ స్థాయికి

## అరకు కాఫీ

### - బ్రాండింగ్ బాధ్యతలు స్వీకరించిన టాటా

- గిరిజన అభివృద్ధి లక్ష్యంగా చంద్రబాబు సమక్షంలో 21 సంస్థలతో ఒప్పందాలు
- ఏజెన్సీలో హోమ్‌స్టేల ఏర్పాటుకు ముందుకొచ్చిన ఓయో
- అమెరికాలో జీసీసీ ఉత్పత్తుల విక్రయానికి కీలక ఎంఓయూ
- రబ్బరు, కాఫీ సాగు విస్తరణకు ఐటీడీఏలతో బోర్డుల ఒప్పందం

2లో..



## ఇక రాజకీయాలు వద్దనుకుంటున్న

- తనకు 73 సంవత్సరాలు వచ్చాయన్న మల్లారెడ్డి
- వచ్చే ఎన్నికల నాటికి రాజకీయాల నుంచి తప్పుకునే ఆలోచనలో ఉన్నానని వెల్లడి
- ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ఉన్నానన్న మల్లారెడ్డి
- ఇక ఏవైపు చూడాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ

2లో..



## పాక్ ను చావుదెబ్బ కొట్టాం

### - ఆపరేషన్ సిందూర్ పై ఎయిర్‌ఫోర్స్ చీఫ్ సంచలన విషయాలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రపంచం మొత్తాన్నీ ఉలిక్కిపడేలా చేసిన ఉదంతం పహల్గామ్ ఉగ్రదాడి. 26 మందిని పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదుల ఘాతుకానికి అమెరికా మొదలుకుని ఆఫ్ఘనిస్తాన్ దాకా దాదాపుగా అన్ని దేశాలు స్పందించాయి. భారత్‌కు 2లో..

# ట్రంప్-పుతిన్ చర్చలను స్వాగతించిన భారత్

ఈ సమావేశం ఒక ముగింపు పలుకుతుందని ప్రపంచ దేశాలు ఆశిస్తున్నాయి. గత మూడు రోజులుగా చోటుచేసుకున్న వేగవంతమైన పరిణామాల అనంతరం ఈ భేటీ ఖరారైంది. “ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమావేశం ఆగస్ట్ 15, శుక్రవారం నాడు అలస్కాలో జరుగుతుంది” అని ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ట్రూత్ సోషల్’లో వెల్లడించారు. ఈ సమావేశం భారత్‌కు కూడా ఎంతో కీలకం కానుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు వాషింగ్టన్, భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాల భవిష్యత్తు ఈ భేటీతో తేలే అవకాశం ఉంది. ఈ పరిణామాన్ని భారత్ మనస్ఫూర్తిగా స్వాగతించింది. అమెరికా, రష్యా మధ్య కుదిరిన ఈ అవగాహనను అభినందిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. “ఈ సమావేశం ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికి, శాంతికి అవకాశాలు కల్పిస్తుందని ఆశిస్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ అనేకసార్లు చెప్పినట్లుగా ‘ఇది యుద్ధాల యుగం కాదు’” అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ శాంతి ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. శిఖరాగ్ర సమావేశానికి ముందు రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని నరేంద్ర మోదీతో శుక్రవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ అంశంపై అమెరికాతో జరిగిన చర్చల వివరాలను ఆయన మోదీకి వివరించారు. భారత్-రష్యా మధ్య ఉన్న ప్రత్యేక భాగస్వామ్యం దృష్ట్యా, అమెరికా అధ్యక్షుడి ప్రత్యేక దూత స్టీవెన్ విట్కాఫ్‌తో జరిగిన సమావేశంలోని కీలక అంశాలను పుతిన్ పంచుకున్నారని రష్యా అధ్యక్ష కార్యాలయం తెలిపింది. పుతిన్ అందించిన వివరాలకు ధన్యవాదాలు తెలిపిన ప్రధాని మోదీ, వివాదానికి శాంతియుత పరిష్కారం కనుగొనాలన్నదే భారత్ స్థిరమైన వైఖరి అని పునరుద్ఘాటించారు. ఈ సమావేశానికి ట్రంప్ ప్రత్యేక దూత స్టీవెన్ విట్కాఫ్, పుతిన్‌తో మాస్కోలో జరిపిన చర్చలే పునాది వేశాయి. ఈ చర్చల అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, పుతిన్‌తో సానుకూల చర్చలు జరిగాయని, శాంతి నెలకొనేందుకు మంచి అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. “ఇరు దేశాల ప్రయోజనాల కోసం కొన్ని భూభాగాల మార్పిడి కూడా ఉండొచ్చు” అని ట్రంప్ వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది.

# చిన్నారులు, బ్రహ్మకుమారీలతో రక్షాబంధన్ వేడుకలు

చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ప్రధాని మోదీకి రాఖీలు కట్టి తమ ప్రేమను చాటుకున్నారు. కొందరు చిన్నారులు ప్రధానితో కరచాలనం చేయగా, మరికొందరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇంకొందరు ఆయన చెంపపై ముద్దులు పెట్టి తమ అభిమానాన్ని వ్యక్తపరిచారు. చిన్నారుల ఆప్యాయతకు ప్రధాని మోదీ కూడా అంతే ప్రేమగా స్పందించారు. వారిని దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా పలకరించి, ఆశీస్సులు అందించారు. ప్రధాని చుట్టూ చిన్నారులు సందడి చేస్తున్న చిత్రాలను ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసింది. ఈ వేడుకల్లో బ్రహ్మకుమారీలు కూడా పాల్గొన్నారు. పలువురు బ్రహ్మకుమారీలు ప్రధానికి పవిత్రమైన రాఖీని కట్టి శుభాకాంక్షలు తెలిపారు. వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అంతకుముందు, ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక ‘ఎక్స్’ ద్వారా దేశ ప్రజలందరికీ రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. “రక్షా బంధన్ ప్రత్యేక సందర్భంలో దేశ ప్రజలందరికీ నా శుభాకాంక్షలు” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. శ్రావణ మాసంలోని పౌర్ణమి రోజున జరుపుకునే ఈ పండుగ, సోదర సోదరీమణుల మధ్య ఉండే పవిత్ర బంధాన్ని గౌరవిస్తుంది.

# కశ్మీర్‌లో చారిత్రాత్మక ఘట్టం

లింక్ (యూఎస్‌బీఆర్ఎల్) ప్రాజెక్టులో అత్యంత కీలకమైన బనిహాల్-సంగల్దాన్-రియాసి-కాట్రా సెక్షన్ అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించినట్లయింది. ఈ విజయంతో కశ్మీర్ లోయ భారత రైల్వేల సరుకు రవాణా కారిడార్‌తో నేరుగా అనుసంధానమైంది. ఈ కొత్త రైలు మార్గం వల్ల కశ్మీర్ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతం లభించనుంది. ఇప్పటివరకు సరుకుల రవాణాకు శ్రీనగర్-జమ్మూ జాతీయ రహదారిపైనే ఆధారపడాల్సి వచ్చేది. అయితే, కొండచరియలు విరిగిపడటం, వాతావరణ సమస్యల వల్ల ఈ రహదారి తరచూ మూతపడేది. దీంతో రవాణాలో తీవ్ర అనిశ్చితి నెలకొనేది. ఇప్పుడు రైలు మార్గం అందుబాటులోకి రావడంతో ఆ కష్టాలకు తెరపడినట్లయింది. రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గనుండటంతో పాటు, ఏడాది పొడవునా దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా కశ్మీర్‌కు, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు సరుకులను సులభంగా చేరవేయవచ్చు. ముఖ్యంగా, లోయలో భారీగా పండే యాపిల్స్ వంటి ఉద్యాన ఉత్పత్తులను దేశంలోని ఇతర మార్కెట్లకు వేగంగా తరలించేందుకు మార్గం సుగమమైంది. కాగా, ఆగస్టు 10న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమృత్‌సర్, శ్రీ మాతా వైష్ణో దేవి కాట్రా మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. భారత రైల్వే చరిత్రలోనే యూఎస్‌బీఆర్ఎల్ ప్రాజెక్టు ఒక ఇంజినీరింగ్ అద్భుతంగా నిలిచింది. అత్యంత కఠినమైన హిమాలయ పర్వత ప్రాంతాలలో ఎన్నో భౌగోళిక, సాంకేతిక సవాళ్లను అధిగమించి ఈ మార్గాన్ని నిర్మించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి అయిన చీనాబ్ వంతెన, దేశంలోనే తొలి కేబుల్ ఆధారిత రైల్వే వంతెన అంజి ఖడ్ బ్రిడ్జి ఈ ప్రాజెక్టులో భాగమే. ఈ మార్గంలో మొత్తం 38 సొరంగాలు ఉన్నాయి. ఈ రైల్వే ప్రాజెక్టు రాకతో విద్యార్థులు, వ్యాపారులు, పర్యాటక రంగ నిపుణులు, సామాన్య ప్రజలకు దేశంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణం సురక్షితంగా, చౌకగా మారింది. ప్రస్తుతం కాట్రా, బారాముల్లా మధ్య నడుస్తున్న రైలు సేవలను ఈ ఏడాది చివరికల్లా జమ్మూ రైల్వే స్టేషన్ నుంచి బారాముల్లా వరకు విస్తరించనున్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం సంచలనం

పరిశీలనలో బయటపడిందని స్పష్టం చేసింది. కాగా ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందు దేశంలో మొత్తం 2,854 గుర్తింపు లేని రాజకీయ పార్టీలు ఉండేవి. ఇప్పుడు 334 పార్టీలను జాబితా నుంచి రద్దు చేయడంతో వాటి సంఖ్య 2,520కి తగ్గింది. ఈ నిర్ణయం కేవలం గుర్తింపు లేని క్రియారహిత పార్టీలకే వర్తిస్తుందని ఈసీ స్పష్టం చేసింది. ఈ తరహా తనిఖీలు, కఠిన చర్యలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని ఈసీ వర్గాలు తెలిపాయి. అలాగే కొత్తగా పార్టీ రిజిస్ట్రేషన్, గుర్తింపు ప్రక్రియలను మరింత కఠినతరం చేసే అవకాశముందని సంకేతాలు వస్తున్నాయి. మరోవైపు ప్రస్తుతం చురుకుగా ఉన్న 6 జాతీయ పార్టీలు, 67 రాష్ట్రస్థాయి పార్టీలపై ఈ ప్రభావం ఉండదని కూడా తెలిపింది. గతంలో కొన్ని చిన్నపాటి రాజకీయ పార్టీలు పన్ను ఎగవేత నల్లధనాన్ని - తెల్లధనంగా మార్చుకునేందుకు ఉపయోగపడుతున్నట్లు విచారణలో బయటపడిందని వెల్లడించింది. నకిలీ విరాళాలు, రసీదులలో మార్పు రా నిధులను మళ్లించిన అంశాలు వెలుగులోకి రావడంతో ఈసీ ఈసీ చర్యలకు దిగిందని భావిస్తున్నారు.

# ఇది దేవుడు సృష్టించిన అద్భుతం

చిరకాల ఆకాంక్ష అయిన ఉపాధ్యాయ ఉద్యోగాల్లో 100 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో నంబర్ 3ను పునరుద్ధరించే బాధ్యత తనదేనని ఉద్ఘాటించారు. ఏజెన్సీ ప్రాంతాలను దేవుడు సృష్టించిన అద్భుతంగా అభివర్ణించిన చంద్రబాబు, ఇక్కడి స్వచ్ఛమైన కొండలు, సహజసిద్ధమైన ప్రజల మనస్తత్వం తనను ఆకర్షించాయని తెలిపారు. “మళ్లీ జన్మ ఉంటే ఈ ఏజెన్సీలోనే పుట్టాలని కోరుకుంటున్నాను” అని అన్నారు.

గిరిజనుల సహజ నైపుణ్యం, సామర్థ్యాలను ప్రశంసిస్తూ, వారి అభివృద్ధి ద్వారానే రాష్ట్రం సంపూర్ణ వికాసం సాధ్యమని ఆయన పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మొదటి నుంచి ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడిగా ఎన్టీఆర్‌ను గుర్తు చేస్తూ, ఆ దిశగా తమ ప్రభుత్వం కృషి కొనసాగిస్తుందని చంద్రబాబు తెలిపారు. ఏజెన్సీలోని 1,483 గిరిజన గూడేలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు రూ. 2,850 కోట్లు మంజూరు చేస్తున్నామని చంద్రబాబు ప్రకటించారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన తాగునీరు అందిస్తామని, దీని కోసం రూ. 220 కోట్లతో పనులు చేపడుతున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు రూ. 482 కోట్ల వ్యయంతో ఐదు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు పాడేరు, రంపచోడవరం, శ్రీశైలం ఐటీడీఏల పరిధిలోనూ ఆసుపత్రులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జీవో నంబర్ 3 రద్దు కావడానికి గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని చంద్రబాబు ఆరోపించారు. తమ హయాంలో గిరిజన యువతకు న్యాయం చేసేందుకు రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ఆధారంగా జీవో తెచ్చామని, కానీ గత ప్రభుత్వం కోర్టులో సరిగ్గా వాదనలు వినిపించలేకపోయిందని విమర్శించారు. న్యాయపరమైన అంశాలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా ఈ జీవోను పునరుద్ధరించి గిరిజనులకు న్యాయం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఏజెన్సీ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా బ్రాండింగ్ కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు.
కాఫీ, మిరియాలు, పసుపు వంటి ఆర్గానిక్ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర లభించేలా చూస్తామన్నారు. వెదురు ఉత్పత్తుల ద్వారా 5 వేల మంది గిరిజన మహిళలకు ఏడాదికి లక్ష రూపాయల ఆదాయం వచ్చేలా ప్రత్యేక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. టూరిజం హబ్స్‌గా ఏజెన్సీ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, యువతకు ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం వంటివి ఇప్పటికే అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం తనకు రెండు కళ్ల వంటివని, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అన్ని చర్యలు తీసుకుంటానని చంద్రబాబు స్పష్టం చేశారు.

# వితంతువులకు సోదరుడిగా.. రాఖీ గిఫ్ట్స్

పంపారు. వివిధ కారణాలతో భర్తను కోల్పోయిన వితంతువులకు.. సోదరుడిగా నేనున్నాననే భరోసా కల్పించడంతో పాటుగా వారందరిలో ఆత్మస్థైర్యం నింపేలా పవన్ కళ్యాణ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే ప్రతి ఆడపడుచునూ గౌరవిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించాలని జనసేన నేతలను ఆదేశించారు. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రాఖీ పండుగ కానుకగా పిఠాపురం నియోజకవర్గానికి చీరలను పంపించారు. ఈ చీరలను పిఠాపురం నియోజకవర్గం జనసేన నేతలు ఇంటింటికి వెళ్లి పవన్ కళ్యాణ్ తరుపున రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపి అందజేశారు. ఈ సందర్భంగా పిఠాపురం శాసన సభ్యుడిగా మాత్రమే కాకుండా, సోదరుడిగా, కుటుంబ సభ్యుడిగా ఈ కానుకలు పంపినట్లు పవన్ కళ్యాణ్ సందేశాన్ని వారికి తెలియజేశారు. ఊహించని విధంగా పవన్ కళ్యాణ్ నుంచి వచ్చిన రాఖీ పండుగ కానుకతో మహిళలు ఉద్వేగానికి గురయ్యారు. తమను అక్కాచెల్లెళ్లుగా స్వీకరించి చీరలు పంపించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో జనసేన నేతలు కూడా పలుచోట్ల రాఖీ పండగ కానుకలు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో వితంతు మహిళలకు రక్షా బంధన్ కానుకలు పంపిణీ చేశారు. వారికి ఎలాంటి సమస్య వచ్చినా జనసేన పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మరోవైపు పిఠాపురంలోని అనాథ పిల్లల కోసం పవన్ కళ్యాణ్ ఇప్పటికే తన నెల జీతం విరాళంగా అందిస్తున్నారు. అలాగే పిఠాపురంలోని ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల భద్రత కోసం కిట్లను కూడా ఇటీవల పంపిణీ చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో ఏడాది కాలంలో సుమారుగా రూ.300 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి రికార్డు స్థాయి మెజారిటీతో పవన్ కళ్యాణ్ తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన సంగతి తెలిసిందే.

# తెలంగాణలో మరో భారీ పెట్టుబడి బృందం సీఎంకు వివరించింది.

ఫ్లోటింగ్ సోలార్ (నీటిపై తేలియాడే సౌర విద్యుత్ ప్లాంట్లు) ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలో దాదాపు 6,700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని ఎన్టీపీసీ అధికారులు తెలిపారు. ఇటువంటి భారీ పెట్టుబడులు రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తాయని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎన్టీపీసీకి అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పెట్టుబడులు రావడం వల్ల రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణకు, కొత్త ఉద్యోగాల కల్పనకు కూడా ఈ ప్రాజెక్టులు దోహదపడతాయి. ముఖ్యంగా ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు భూమిని వినియోగించుకోకుండా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఇది భూమి కొరత ఉన్న ప్రాంతాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు రాష్ట్రంలోని పెద్ద రిజర్వాయర్లు, జలాశయాలు అనుకూలంగా ఉంటాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం తన విద్యుత్ అవసరాల కోసం థర్మల్, జల విద్యుత్ పై ఆధారపడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న జనాభా, వ్యవసాయ భూముల విస్తీర్ణం, పారిశ్రామిక, సేవా రంగాల వృద్ధి కారణంగా విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఈ పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి థర్మల్ విద్యుత్ కేంద్రాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. థర్మల్ విద్యుత్ కేంద్రాలు బొగ్గు, సహజ వాయువు, డీజిల్ వంటి ఇంధనాలను ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఈ కేంద్రాలలో ఇంధనాన్ని మండించి, దాని ద్వారా వచ్చే వేడితో నీటిని ఆవిరిగా మార్చి, ఆ ఆవిరి ఒత్తిడితో టర్బైన్‌లను తిప్పి విద్యుత్‌ను తయారు చేస్తారు. తెలంగాణలో పలు థర్మల్ విద్యుత్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. అందులో కొన్ని ఇప్పటికే వాడుకలో ఉండగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న కేంద్రాలు రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. నిర్మాణంలో ఉన్న కేంద్రాలు భవిష్యత్తులో విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచడానికి దోహదపడతాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి కూడా కలిస్తే అదనపు విద్యుత్ కలిగిన రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఇక రాజకీయాలు వద్దనుకుంటున్న

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ‘పాలమ్మిన, పూలమ్మిన’ అంటూ తన కష్టాలను సూటిగా, స్పష్టంగా చెప్పి ప్రజల హృదయాల్లో చోటు సంపాదించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల నాటికి రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోవాలని ఆలోచిస్తున్నట్లు ఆయన శనివారం మీడియాతో అన్నారు.

## రాజకీయ జీవితానికి ముగింపు పలకాలనుకుంటున్నా..

రాఖీ పండుగ సందర్భంగా తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన మల్లారెడ్డి, తనకు 73 సంవత్సరాలు వచ్చాయని చెప్పారు. తాను ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేశానని, ఇకపై రాజకీయాలు చాలని భావిస్తున్నానని అన్నారు. మరో మూడు సంవత్సరాలు మాత్రమే రాజకీయాల్లో కొనసాగుతానని.. ఆ తర్వాత ప్రజాసేవ చేస్తూ, తన విద్యాసంస్థలైన కాలేజీలు, యూనివర్సిటీలను అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం తాను ఏ పార్టీ వైపు మొగ్గు చూపడం లేదని, బీఆర్ఎస్లోనే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు.

## రాజకీయాల్లో మల్లారెడ్డి ప్రస్థానం..

మల్లారెడ్డి రాజకీయ ప్రయాణం చాలా ఆసక్తికరంగా సాగింది. తొలుత ఆయన వ్యాపారవేత్తగా, విద్యాసంస్థల అధినేతగా ఎదిగారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి 2014లో టీడీపీ తరపున మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి 2018లో మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవిని కూడా పొందారు. ఆయన ఏ విషయం చెప్పినా అది విలేకరుల సమావేశం అయినా, బహిరంగ సభ అయినా తనదైన శైలిలో సూటిగా, స్పష్టంగా మాట్లాడుతూ ప్రజల దృష్టిని ఆకర్షించేవారు. ఆయన చేసిన ఈ తాజా ప్రకటన తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే.. ఆయన నిజంగానే రాజకీయాల నుంచి తప్పుకుంటారా, లేక భవిష్యత్తులో మనసు మార్చుకుంటారా అనేది కాలమే నిర్ణయిస్తుంది. మల్లారెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీకి షాక్ ఇచ్చాయని చెప్పవచ్చు. బలమైన ప్రజా బలం ఉన్న నాయకుడు పార్టీని వీడితే అది పార్టీకి నష్టం కలిగించవచ్చు. మరోవైపు ఈ వ్యాఖ్యల వల్ల కొత్తగా రాజకీయాల్లోకి రావాలనుకునేవారికి అవకాశాలు లభించవచ్చని భావిస్తున్నారు. మల్లారెడ్డి నిజంగానే రాజకీయాల నుంచి వైదొలగితే ఆయన ప్రాతినిధ్యం వహించే మేడ్చల్ నియోజకవర్గంలో కొత్త నాయకుడు ఎవరనేది ఆసక్తికరంగా మారింది. మల్లారెడ్డి నిర్ణయం వెనుక వ్యక్తిగత కారణాలతో పాటు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు కూడా ఒక కారణమై ఉండవచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# పాక్ ను చావుదెబ్బ కొట్టాం

అండగా నిలిచాయి. ఉగ్రవాద నిర్మూలనకు సహకరిస్తామని వెల్లడించాయి. ఈ దిగ్భ్రాంతికర ఘటనను కేంద్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది. పాకిస్తాన్‌పై కఠిన ఆంక్షలను విధించింది. ఇండస్ రివర్ ట్రీటీ సహా పలు కీలక నిర్ణయాలను అమలులోకి తీసుకొచ్చింది. అట్టారీ-వాఘా సరిహద్దు చెక్‌పోస్ట్‌ను మూసివేయడమే కాకుండా దేశంలో నివస్తోన్న పాకిస్తానీయులనూ స్వదేశానికి వెళ్లిపోవాలంటూ ఆదేశించింది. అదే సమయంలో ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌కు భారీ నష్టం వాటిల్లినట్లు తాజాగా భారత వైమానిక దళం మొదటిసారిగా వెల్లడించింది. ఈ ఆపరేషన్‌లో అయిదు యుద్ధ విమానాలు సహా మొత్తం ఆరు పాకిస్తాన్ విమానాలను కూల్చివేసినట్లు ధృవీకరించింది. గాలిలో ఉండగా ఆరు విమానాలను కూల్చివేశామని, అలాగే- పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై తాము జరిగిన వైమానిక దాడుల్లో ఆ దేశ ఎయిర్ బేస్ కూడా భారీ నష్టం వాటిల్లిందని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. బెంగళూరులో ఎయిర్ చీఫ్ మార్షల్ లక్మణ్ మాధవ్ కత్రే 16వ స్మారకోపన్యాసంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏపీ సింగ్ మాట్లాడుతూ మే 7న పహల్గామ్ దాడి తర్వాత జరిగిన ఆపరేషన్ సింధూర్ లో భారత్ ఘన విజయం సాధించడంలో ఎస్-400 సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణి వ్యవస్థ కీలకంగా వ్యవహరించిందని అన్నారు. తమ దాడిలో పాకిస్తాన్ కు చెందిన ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ ధ్వంసమైందని, దీని నష్టం పాకిస్తాన్ వైమానిక బలం నిర్వీర్యమైందని చెప్పారు. పాకిస్తాన్‌లోని జకోబాబాద్, భోలారీల్లోని హ్యాంగర్‌లను కూడా లక్ష్యంగా చేసుకున్నామని ఏపీ సింగ్ వివరించారు. జకోబాబాద్ లో ఎఫ్-16 యుద్ధ విమానాలు, భోలారీలో ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ ధ్వంసమైనట్లు అప్పట్లో వార్తలొచ్చాయి. అవి వాస్తవమేనని తాజాగా ఏపీ సింగ్ నిర్ధారించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా ఆపరేషన్ సింధూర్ సమయంలో దేశ వైమానిక దళాలు భారీ నష్టాన్ని కలిగించడంతో పాకిస్తాన్ యుద్ధాన్ని కొనసాగించలేక చేతులెత్తేసిందని ఏపీ సింగ్ అన్నారు. ఈ యుద్ధాన్ని కొనసాగించితే మరింత మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆ దేశం గ్రహించిందని, ఆ పరిణామమే పాకిస్తాన్ కాల్పుల విరమణ కోరడానికి దారితీసిందని ఆయన అన్నారు. దాడులను ప్లాన్ చేయడానికి, అమలు చేయడానికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చినందుకు రాజకీయ నాయకత్వాన్ని కూడా ఎయిర్ చీఫ్ మార్షల్ సింగ్ ప్రశంసించారు. ఈ విజయానికి ముఖ్య కారణం రాజకీయ సంకల్పమేనని, దాడులకు సంబంధించినంత వరకు తమకు చాలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, ఎటువంటి ఆంక్షలు కూడా విధించలేదని చెప్పారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో త్రివిధ దళాలకు ఏవైనా పరిమితులు ఉంటే, అవి తమకు తాముగా తీసుకున్నవేనని అమర్ ప్రీత్ సింగ్ వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ పై యుద్ధాన్ని కొనసాగించే విషయంలో ఎంతవరకు ముందుకు వెళ్లాలో అంత వరకు వెళ్లాలని నిర్ణయించుకున్నామని, తమకు ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు గానీ, అడ్డంకులు గానీ ఎదురు కాలేదని అన్నారు. తాము ముందుగా నిర్దేశించుకున్న వ్యూహాలను పక్కాగా అమలు చేయడానికి పూర్తి స్వేచ్ఛ లభించిందని ఎయిర్ చీఫ్ మార్షల్ వివరించారు.

# ట్యాపింగ్ చేయించలేదని ప్రమాణం చేస్తావా

తిట్లు లేవు. మాట్లాడని బూతుల్లేవు. చేయని తప్పులు లేవు. జరపని అవినీతి లేదు, నోటీసులిస్తే ఏం చేయాలో తనకు తెలుసని బండి సంజయ్ అన్నారు. ఒక రాజకీయ నాయకుడివై ఉండి నేరుగా ఎదుర్కొనే దమ్ములేక చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి లీగల్ నోటీసులతో బెదిరించాలనుకోవడం అంతకంటే మూర?త్వం లేదని విమర్శించారు. ఆ నోటీసులకు భయపడే వ్యక్తిత్వం నాది. అయ్య పేరు చెప్పుకుని రాజకీయాల్లో రాలేదు. దేశం కోసం, ధర్మ రక్షణ కోసం రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసి జైలుకు పోయి వచ్చినోడినని గుర్తు చేశారు. ఏ గుడికి అంటే ఆ గుడికి నా కుటుంబంతో సహా వస్తా నువ్వు కూడా నీ భార్యా, పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి గుడికి వస్తావా.? వచ్చి ఫోన్ ట్యాపింగ్ తో నాకు సంబంధం లేదు.? అని ప్రమాణం చేయిస్తావా.? నువ్వు ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు నేను, నా కుటుంబ సభ్యులంతా ప్రమాణం చేస్తాం. నీకు ఆలయంపై నమ్మకం లేదంటే మసీదు, చర్చికైనా వెళదాం. ప్రమాణానికి సిద్ధమా? నా సవాల్ కు స్పందించాలని కోరుతున్నానన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం, రోషం ఉంటే ఆ పార్టీని వదిలి బయటకు రావాలి. ఎందుకంటే ఆనాడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుసహా అందరి ఫోన్లను ట్యాప్ చేశారు. అయినా మీరు ఇంకా ఎట్లా బీఆర్ఎస్ లో ఉంటున్నారో అర్థం కావడం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ పై సీబీఐ విచారణ జరిపించాలనే విషయంలో మాకు స్పష్టత ఉంది. ఎందుకంటే సిట్ పరిమితి చాలా తక్కువ. ఎందుకంటే మావోయిస్టుల పేరు చెప్పి రాజకీయ ప్రముఖుల, సినీ తారల, వ్యాపారుల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఫోన్ నెంబర్లను ట్యాప్ చేసి బ్లాక్ మెయిల్ చేసి వసూళ్లకు పాల్పడ్డారు. ఆ డబ్బుల లావాదేవీలకు సంబంధించి పూర్తిస్థాయి వాస్తవాలు వెలుగులోకి రావాలంటే ఈడీ మాత్రమే విచారణ చేస్తేనే అది సాధ్యమవుతుంది. అట్లాగే టెలికం రెగ్యులేటరీ అథారిటీ నిబంధనలను ఉల్లంఘించి కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిపించింది. ఇది పూర్తిగా కేంద్ర పరిధిలోని అంశం ఎస్ఐబీ చీఫ్ గా ప్రభాకర్ రావును నియమించడం కేంద్ర హోంశాఖ నిబంధనలకు విరుద్ధం. ఎందుకంటే ఎస్ఐబీ చీఫ్ గా నియమితులైన వ్యక్తి ఐజీ స్థాయి అధికారి అయి ఉండాలి. కానీ ప్రభాకర్ రావు అప్పటికే రిటైర్డ్ అయ్యారని గుర్తు చేశారు. ప్రభాకర్ రావు ఐజీగా కొనసాగుతున్నారని కేంద్ర హోంశాఖకు కేసీఆర్ తప్పుడు సమాచారమిచ్చి ఎస్ఐబీ చీఫ్ గా నియమించారు. అట్లాగే జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు సిట్ పోలీసులు ఆధారాలతోసహా వెల్లడించారు. జడ్జీలకు నోటీసులిచ్చి పిలిచి స్టేట్ మెంట్ రికార్డ్ చేసే అధికారం సిట్ కు ఉందా? అది జరిగే పనికాదు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రుల ఫోన్లను కూడా గత ప్రభుత్వం ట్యాప్ చేసింది. ఆ ఆధారాలు సిట్ వద్ద ఉన్నాయన్నారు. భార్యభర్తల ఫోన్లను కూడా ట్యాప్ చేసిన నీచులు మీరు. అసలు ఎస్ఐబీ దేని కోసం పనిచేయాలి.? మావోయిస్టుల కదలికల కోసం పనిచేయాలి కదా.? ఎంతో మంది ఎస్ఐబీ అధికారులు మావోయిస్టుల చేతిలో బలయ్యారని తెలియదా.? అని ప్రశ్నించారు. సిట్ అధికారులపై మాకు నమ్మకం ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం లేదు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లు, ఫార్ములా ఈ రేసుసహా అనేక కేసుల్లో విచారణ పేరుతో జాప్యం చేస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కల్వకుంట్ల కవితకు కూడా నోటీసులిచ్చి విచారణ జరపాలని కోరుతున్నానన్నారు.

# ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్

సమీక్షించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫారుకి, రెడ్కో సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్ కు పంపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్లో ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచి పంపిస్తామని చెప్పారు. కలెక్టరేట్లలో ఏమైనా మంచి డిజైన్లు ఉంటే కనుక వాటిని హైదరాబాద్ కు పంపాలని ఈ సందర్భంగా కలెక్టర్లకు ఆయన సూచించారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్స్

గ్రామపంచాయతీ మొదలుకొని సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేస్తామన్నారు. వాటి ద్వారా పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపించారు. అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆఫీసుకి పంపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై తెలంగాణ ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లను భట్టి విక్రమార్క ఆదేశించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలు సైతం పంపాలని కలెక్టర్లకు సూచించారు.

## నల్లమల డిక్లరేషన్ ప్రకటించిన ప్రభుత్వం

గత కాంగ్రెస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ ఓ ఎఫ్ ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను పంపిణీ చేసింది. ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్లకు భట్టి విక్రమార్క వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించాం. ఈ ఆగస్టు నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలోప్రభుత్వం ఉంది. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కనుక కలెక్టర్లు దీనిపై సత్వరం స్పందించి వారంలోగా వివరాలు పంపండి, ఈ విషయాల్లో ఏమైనా సందేహాలు ఉంటే విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలు, రెడ్కో వీసీ/ఎండీ ని సంప్రదించాలని’ కలెక్టర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# అంతర్జాతీయ స్థాయికి అరకు కాఫీ

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అరకు కాఫీకి మరింత బ్రాండ్ ఇమేజ్ తీసుకురావడమే కాకుండా, ఆదివాసీల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించే దిశగా పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకుంది. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాడేరులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో మొత్తం 21 ఒప్పందాలు జరిగాయి. వీటిలో అత్యంత కీలకమైనది, ప్రముఖ కార్పొరేట్ దిగ్గజం టాటా కన్స్యూమర్స్ సంస్థతో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చేసుకున్న ఒప్పందం. ఈ ఒప్పందం ద్వారా ఆర్గానిక్ అరకు కాఫీని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను టాటా స్వీకరించనుంది. ఇది అరకు కాఫీ ఖ్యాతిని కొత్త శిఖరాలకు చేర్చగలదని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, కాఫీ సాగును ప్రోత్సహించేందుకు ఐటీసీ సంస్థ పాడేరు ఐటీడీఏతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే 4,010 హెక్టార్లలో కాఫీ సాగు చేస్తున్న ఐటీసీ, అదనంగా మరో 1,600 హెక్టార్లలో సాగును విస్తరించనుంది. గిరిజన ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించి, స్థానికులకు ఉపాధి కల్పించేందుకు ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థలు ఓయో హోమ్స్, హోమీ హట్స్ ముందుకొచ్చాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో హోమ్‌స్టేల అభివృద్ధి, నిర్వహణ కోసం ఈ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. దీని ద్వారా పర్యాటకులకు మెరుగైన వసతి సౌకర్యాలు లభించడంతో పాటు గిరిజనులకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ఏపీ గిరిజనోత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు పరిచయం చేసే లక్ష్యంతో అమెరికాకు చెందిన హాతీ సర్వీసెస్ ఎల్ఎల్‌సీ సంస్థతో జీసీసీ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికాలో జీసీసీ రిటైల్ కార్యకలాపాలు ప్రారంభించనుంది. దేశవ్యాప్తంగా గిరిజన ఉత్పత్తుల విక్రయానికి ట్రైఫెడ్‌తో కలిసి జీసీసీ రిటైల్ షోరూమ్‌లను ఏర్పాటు చేయనుంది.

ఇవే కాకుండా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో రబ్బరు సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర రబ్బరు బోర్డు, చింతపల్లిలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సబ్ కో సంస్థ, పసుపు ప్రాసెసింగ్ కోసం ఎక్విప్ సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందాలన్నీ గిరిజనులకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపరచడం, వారి ఉత్పత్తులకు సరైన ధర కల్పించడం, పర్యాటక రంగం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా జరిగాయి.

# ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

ఉప్పల్, : రాఖీ పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్తున్న వారి సంఖ్య పెరగడంతో హైదరాబాద్-విజయవాడ రహదారిపై తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయతనగర్, అబ్దుల్లాపూర్మెట్ ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద కూడా పండగ రద్దీతో ట్రాఫిక్ స్తంభించింది. దీనివల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# అల్జీమర్స్ రహస్యం వీడింది

## – ఆ లోహం లోపమే కారణమట



ప్రపంచవ్యాప్తంగా లక్షల మందిని వేధిస్తున్న మతిమరుపు వ్యాధి అల్జీమర్స్‌కు శరీరంలో ఒక సాధారణ లోహం లోపించడమే కీలక కారణం కావచ్చని ఓ సంచలన అధ్యయనం వెల్లడించింది. దశాబ్దకాలం పాటు సాగిన ఈ పరిశోధనలో హార్వర్డ్ మెడికల్ స్కూల్ శాస్త్రవేత్తలు ఈ కీలక విషయాన్ని కనుగొన్నారు. మెదడులో సహజంగా ఉండే లిథియం అనే లోహం తగ్గడమే అల్జీమర్స్‌కు దారితీసే తొలి మార్పులలో ఒకటని తేల్చారు. మెదడులోని అన్ని ప్రధాన కణాల సాధారణ పనితీరును లిథియం కాపాడుతుందని, నరాలు దెబ్బతినకుండా నివారిస్తుందని ఈ అధ్యయనం మొదటిసారిగా చూపించింది. ఆరోగ్యవంతులు, మతిమరుపు తొలిదశలో ఉన్నవారు, అల్జీమర్స్ ముదిరిన వారి నుంచి మెదడు, రక్త నమూనాలను సేకరించి, సుమారు 30 రకాల లోహాల స్థాయిలను శాస్త్రవేత్తలు విశ్లేషించారు. అడ్వాన్స్డ్ మాస్ స్పెక్ట్రోస్కోపీ అనే పద్ధతిని ఉపయోగించి చేసిన ఈ పరిశీలనలో, కేవలం లిథియం స్థాయులలో మాత్రమే స్పష్టమైన తేడాలు కనిపించాయి. అల్జీమర్స్‌కు సంకేతంగా భావించే అమైలాయిడ్ ఫలకాలతో లిథియం బందీ కావడం వల్ల మెదడులో దీని స్థాయులు తగ్గుతున్నట్టు కొన్ని కేసుల్లో గుర్తించారు. అయితే, లిథియం ఒరొటేట్ అనే కొత్త రకం లిథియం సమ్మేళనం ఈ ఫలకాలకు చిక్కకుండా, ఎలుకల్లో జ్ఞాపకశక్తిని పునరుద్ధరించగలదని పరిశోధకులు తేల్చారు. సాధారణంగా మానసిక వ్యాధుల చికిత్సకు లిథియంను అధిక మోతాదులో వాడతారు. కానీ, అది వృద్ధులకు విషపూరితం కావచ్చు. ఇప్పుడు కనుగొన్న లిథియం ఒరొటేట్ ఆ మోతాదులో వెయ్యో వంతుతోనే పనిచేస్తుండటం విశేషం. "వాతావరణం నుంచి మనకు లభించే ఐరన్, విటమిన్ సి వంటి పోషకాల మాదిరిగానే లిథియం కూడా ముఖ్యమైనదని తేలింది" అని అధ్యయన సీనియర్ రచయిత బ్రూస్ యాంక్నర్ తెలిపారు. "లిథియం లోపం అల్జీమర్స్‌కు కారణం కావచ్చనే ఆలోచన కొత్తది. ఇది భిన్నమైన చికిత్సా విధానాన్ని సూచిస్తోంది" అని ఆయన అన్నారు. ఈ ఫలితాల ఆధారంగా లిథియం స్థాయులను కొలవడం ద్వారా అల్జీమర్స్‌ను ముందే గుర్తించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే, ఎలుకలపై వచ్చిన ఫలితాలను మనుషులపై క్లినికల్ ట్రయల్స్ ద్వారా నిర్ధారించాల్సి ఉందని బ్రూస్ యాంక్నర్ స్పష్టం చేశారు. అయినప్పటికీ, ఇప్పటివరకు వచ్చిన ఫలితాలు చాలా ప్రోత్సాహకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశోధన వివరాలు ప్రఖ్యాత 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

NOTE: ఇంటర్నెట్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు ప్రజాప్రశ్న పత్రిక బాధ్యత వహించదు)

## అన్నా చెల్లెళ్ళు - అక్కా తమ్ముళ్ళ అనుబంధాల మధ్య ఘనంగా రాఖీ పండగ



బడంగ్ పేట్(ప్రశ్నా న్యూస్) అన్నా చెల్లెళ్ళు అక్కా తమ్ముళ మధ్య ఉన్న అనుబంధం గురించి చెప్పే పండుగ రాఖీ. ఈ రోజున సోదరీమణులు తమ సోదరుల చేతులకు రాఖీ కట్టి, ఎల్లప్పుడు ఒకరికొకరు అండగా ఉంటామని చెప్పకనే చెప్తారు. సోదరుడు అంటే జీవితానికి రక్షణ, మార్గదర్శక కాంతి. సుఖదుఃఖాలను పంచుకోవడానికి ఒక సోదరి ఉండాలి. నీకు ఎన్ని కష్టాలు



ఎదురైనా నేను నీకు అండగా ఉంటాను అని ధైర్యం చెప్పడానికి ఒక సోదరుడు ఉండాలి. రాఖీ పండగ సందర్భంగా నగరంలో సందడి నెలకొంది. రాఖీలు, మిఠాయిలు కొనడంలో నిమగ్నమైన మహిళలతో పండగ వాతావరణం సంతరించుకుంది. బడంగ్ పేట్ మున్సిఫల్ కార్పోరేషన్ పరిధిలోని పలు కాలనీలలో అన్న చెల్లెళ్ళు - అక్కా తమ్ముళ్ళ అనుబంధాల మధ్య రాఖీ పండగను అత్యంత ఘనుంగా జరుపుకున్నారు. శనివారం నాడు తెల్లవారుజాము నుండే తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి ఒకరినొకరు అభినందించుకోవడం విశేషం

## వేములవాడలో ఘనంగా "రక్షాబంధన్" వేడుకలు





**వేములవాడ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వేడుకల సందడి కొనసాగుతున్న తరుణంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణం శనివారం సోదర%-%సోదరి అనుబంధంతో మునిగిపోయింది. పట్టణంలోని ఇళు ్ళ,వీధులు, దేవాలయాలు పూల సుగంధంతో,మిఠాయిల రుచులతో కమ్ముకొన్నాయి. శనివారం ఉదయం నుంచే చిన్నారులు,యువతులు, వృద్ధులు సాంప్రదాయ దుస్తుల్లో అందంగా ముస్తాబై, తమ సోదరుల చేతికి రాఖీలు కట్టి సంపూర్ణ ఆయురారోగ్యాలను ఆకాంక్షించారు.సోదరులు సైతం తమ సోదరీమణుల చేతులను పట్టుకుని, ప్రేమాభిమానాల గుర్తుగా బహుమతులు అందజేశారు. అనేక కుటుంబాలు రాఖీ కట్టే కార్యక్రమాన్ని ఆలయ దర్శనంతో ప్రారంభించగా, కొందరు ఇళ్లలో పూజలు చేసి, స్వయంగా తయారు చేసిన మిఠాయిలు,వంటకాలను పంచుకున్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా వేములవాడ పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది. "రాఖీ కేవలం ఒక దారమే కాదు, ఇది మన బంధానికి ప్రతీక" అని స్థానిక మహిళలు పేర్కొన్నారు. చిన్నా%-%పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఈ సంబరాల్లో పాల్గొనడం వేడుకకు మరింత అందం చేకూర్చింది.రాఖీ దారం మాత్రమే కాదు, దానిలో నిక్షిప్తమైన అనుబంధం, అనురాగం మాత్రం అజరామరం అంటూ పట్టణ మహిళలు పిలుపునిచ్చారు.

## పోత్తూరి సుబ్బారావు జయలక్ష్మి దంపతుల వివాహ స్వర్ణోత్సవ శుభాకాంక్షలు

**- డాక్టర్. పి.వి.యమ్. పవన్ అక్షరాంజలి మాస పత్రిక సంపాదకులు**



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** ఎదైనా ఒక లక్ష్యాన్ని సాధించాలంటే కావలసినది ధనమని అందరూ అనుకుంటారు. కానీ అంతకంటే ముఖ్యమైనవి కొన్ని ఉన్నాయి. అవి దృఢసంకల్పం, పట్టుదల, ప్రయత్నం, సాధన ఈ నాలుగూ విజయానికి మూలస్తంభాలు, ఇది నిండుగా ఉన్న వ్యక్తి నిద్రాహారాలు మాని అహరహం ఆరాటపడతాడు. ఈ ఆరాటం ఎంత అంటే అలనాడు పాలసముద్రాన్ని మథించినట్లు ఆ వ్యక్తి మేధస్సునుకూడా ఎన్నో ఆలోచనలు మథిస్తూ ఉంటాయి. మథించగా మథించగా ఎన్నో అద్భుతాలు ఉద్భవించి చివరికి అమృతం ఎలా అయితే పుట్టిందో ఆ లక్ష్యాన్ని సాధించినపుడు మార్గమధ్యంలోకూడా ఎన్నో విషయాలు, సమస్యలు తలెత్తుతుత్తాయి. క్షీరసాగరమథనంలాగానే పట్టుదలగల వ్యక్తి మేధస్సుకూడా మథనం జరిగాక ఒక ప్రజోపయోగమైన ఆవిష్కరణ జరుగుతుంది. అలా ఉద్భవించినదే సాహితీకిరణం మాసపత్రిక. ఒక సంస్థ అయినా, ఒక గ్రంథం అయినా, ఒక కావ్యమైనా వెలువరించాలంటే తల్లి బిడ్డకు జన్మనిచ్చినట్లే. నవమాసాలు మోసిన తల్లికి ప్రసవంకాగానే అమ్మయ్య అయిపోయింది అనుకోలేం కదా ఆ పసికందును ప్రతిక్షణం కళ్ళల్లో పెట్టుకొని కాపాడుకోవాలి. అలాగే ఒక పత్రికను ప్రారంభించడం ఒక ఎత్తు అయితే దానిని నియమబద్ధంగా, అంకితభావంతో నిర్వహించడం వ్యయప్రయాసలతో కూడినది. ఇందుకు సంపాదకులకు పత్రికల గురించి సమగ్ర అవగాహన, ధైర్యం, విజ్ఞానం, కృషి చాలా అవసరం. ఉన్నత విద్యను అభ్యసించి, ప్రతిష్టాత్మక పదవులను అలంకరించిన పొత్తూరి సుబ్బారావు వీటినన్నిటినీ కలిగి తన పత్రికను సమర్థవంతంగా నిర్వహించడంలో అనూహ్యంగా సహకరిస్తున్న తన సతీమణి జయలక్ష్మి తనకు ఒక గొప్పవరమనే చెప్పాలి. పొత్తూరి సుబ్బారావు విజయాలకు కారణమైన జయలక్ష్మి ఉన్నత విద్యావంతురాలేకాదు, సమాజ నిర్మాతలాంటి ఉపాధ్యాయవృత్తిలో దీర్ఘకాలం పనిచేసిన అనుభవజ్ఞురాలు కావడం వలన సుబ్బారావు ఆశయాలకు ఆజ్యం అయినట్లు అయింది. ఒక్కమాటలో చెప్పాలంటే జయలక్ష్మి సుబ్బారావు కి దేవుడిచ్చిన వరం.దాదాపు పదిహేను ఏళ్ళగా నాకుపరిచయం ఉన్న ఈ ఇరువురు పద్ధతిలోనూ, సంప్రదాయంలోనూ, అభిమానంలోనూ, ఆదరణలోనూ, ఆదర్శనీయమనే భావిస్తున్నాను. జయలక్ష్మిగారితో నాకుగల సంబంధం రాఖీబంధమైతే సుబ్బారావుగారితో నాకు గల సంబంధం పత్రికాబంధం. మా అక్షరాంజలి పత్రిక మాకు మానసపుత్రిక అయితే సాహితీకిరణం దత్తపుత్రుడు. పుత్రిక ఎక్కువా.? పుత్రుడు ఎక్కువా.? అని ఎవరైనా అడిగితే జవాబు చెప్పలేని పరిస్థితి నాది.జయలక్ష్మి-సుబ్బారావు దాంపత్యం గతానికి గొప్పగా, వర్తమానానికి ఆదర్శంగా, భావితరానికి స్ఫూర్తిదాయకంగా ఉండగలదని విశ్వసిస్తున్నాను. రత్నాల్లాంటి సంతానానికి జన్మనిచ్చి సమాజంలో బాధ్యతాయుతమైన వ్యక్తులుగా తయారుచేయడమేకాక ప్రజాచైతన్యం కలిగించే సాహితీకిరణం పత్రిక నడిపిస్తూ సాహిత్య, సాంఘిక విషయాలలో వేలాదిమందికి అవగాహన కల్పించడం చాలా ఆనందదాయకం. వీరిరువురూ నిండు నూరేళ్ళూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో, సౌభాగ్యసిరులతో వర్ధిల్లాలని కోరుకుంటూ అక్షరాంజలి మాసపత్రిక తరపున వారికి వివాహ స్వర్ణోత్సవ శుభాకాంక్షలు.

## భీమా చేసుకోని రైతులు సోమవారం రోజు దరఖాస్తు చేసుకోవాలి

- రైతు మరణిస్తే రూ.5 లక్షలు రైతు కుటుంబానికి అందజేయబడతాయి
- రైతు బీమాకి 18-59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు మాత్రమే అర్హులు
- అర్చన, మండల వ్యవసాయ శాఖ అధికారిణి

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** ఈ నెల 5వ తేదీ లోపు తమ భూములకు సంబంధించి కొత్త పట్టా పాస్ పుస్తకాలు వచ్చినా వ్యవసాయ శాఖ అధికారుల వద్ద భీమా చేయించుకోని రైతులు ఎవరైనా వుంటే ఈ నెల 11వ తేదీ (సోమవారం) రోజు రాయిలాపూర్, పూడూరు గ్రామంలో ఉన్న రైతు వేదికలలో వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారిణిలు సుమిత, తేజస్వినిల వద్ద ఉన్న నామినేషన్ దరఖాస్తును నింపి ఆ దరఖాస్తు ఫారానికి రైతు ఆధార్ కార్డ్, పట్టా పాస్ పుస్తకంతో పాటు రైతుకు సంబంధించిన నామిని ఆధార్ కార్డ్ ను పట్టా పాస్ పుస్తకంలో పేరు ఉన్న రైతు స్వయంగా వచ్చి సంతకం చేసీ వ్యవసాయ విస్తీర్ణ అధికారికి ఇవ్వగలరని ఆమె తెలిపారు. 11వ తేదీ సోమవారం వీలుకాని రైతులు 12వ తేదీ మంగళవారం రోజు మేడ్చల్ పట్టణంలో ఉన్న వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి అర్చన పేర్కొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతు భీమా అనేది రైతు మరణిస్తే రూ.5 లక్షలు రైతు కుటుంబానికి అందజేయబడతాయని, రైతు బీమాకి 18-59 సంవత్సరాలు ఉన్న రైతులు మాత్రమే అర్హులున్నారు. ఇది వరకు భీమా ఉన్న రైతులు ఏమైనా మార్పులు చేయించుకోవాలంటే రైతువేదికలో ఉన్న అధికారిణి వద్దకు వచ్చి చేయించుకోవచ్చని తెలిపారు.

## రాఖీ బంధం మరింత ప్రజాసేవకు ప్రేరణ - ఆది శ్రీనివాస్

**- ప్రభుత్వ విప్ ఆదికి రాఖీ కట్టిన ప్రముఖ మహిళలు**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం వేములవాడ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రముఖ మహిళలు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన సొంత చెల్లెలు లీల, వేములవాడ పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తోట లహరి,ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగ శిక్షణ కేంద్ర సభ్యులు మిఠాయిలు తినిపించి, ఆయురారోగ్యాలతో పాటు ప్రజా సేవలో మరింత విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, " కేవలం రాఖీ మాత్రమే కాదు, సోదర భావం,పరస్పర రక్షణకు "రాఖీ" సంకేతం. మీరు ఇచ్చిన ప్రేమ, ఆశీర్వాదాలు నన్ను ప్రజా సేవలో మరింత కట్టుబడిగా కొనసాగించేందుకు ప్రేరేపిస్తాయి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నా శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను" అని విప్ ఆది తెలిపారు.



## 65వ భారత యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



ములుగు (ప్రశ్న న్యూస్) అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ మరియు నియోజకవర్గం అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్ యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించడం జరిగింది,ఈ కార్యక్రమంలో, ములుగు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మారం సుమన్ రెడీ పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమని ఉద్దేశించి జిల్లా యూత్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ యూత్ కాంగ్రెస్ నాయకులు కష్టపడి పని చేయాలని,యూత్ కాంగ్రెస్ యొక్క ప్రాముఖ్యత గురించి చెప్పడం జరిగింది,అలాగే యూత్ కాంగ్రెస్ ను బలోపేతం చేయడంలో అందరం కలసి ముందుకు సాగాలని, కష్ట పడిన ప్రతి యూత్ కార్యకర్తకు తగు ప్రాధాన్యత ఉంటుంది అని, భవిష్యత్ లో యూత్ కాంగ్రెస్ నాయకులకు అనేక అవకాశాలు కల్పించడం జరుగుతుంది అని చెప్పడం జరిగిందిఈ కార్యక్రమంలో జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ రుషికేశ్ రెడ్డి,జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి నేపాల్ రావు,ములుగు మండల అధ్యక్షులు కుక్కల నాగరాజు, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మధు, ములుగు టౌన్ ప్రెసిడెంట్ అభి, మరియు జిల్లా యూత్ నాయకులు వంశీ, నాంపల్లి సుమన్, ఎడ్ల నరేష్, తిరుపతి, నరేష్, శివ, ఖాజా, రాకేష్, సంపత్, ఖన్ని, మనోజ్, గణేష్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ స్నేహం,సోదరభావం సంస్కృతిని పెంపొందించుకోవాలి

**- భాజపా వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** భారతీయ జనతా పార్టీ వేములవాడ పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ శనివారం రక్షాబంధన్ వేడుకలను తన కుటుంబ సభ్యులతో కలిసి సాంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ కేవలం సోదరుడు-సోదరి అనుబంధానికి మాత్రమే కాదు, సమాజంలో పరస్పర విశ్వాసం,రక్షణ భావనకు కూడా ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్నేహం, సోదరభావంతో ఉంటూ ఒకరినొకరు కాపాడుకునే సంస్కృతి పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

## సొంత ఇల్లు కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన పట్టణ మహిళ**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణానికి చెందిన ఒక మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరవడంతో తన సొంత ఇల్లు కల నెరవేర్చినందుకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం రక్షా బంధన్ సందర్భంగా, తన ఇల్లు నిర్మాణ పనులు పరిశీలించేందుకు వచ్చిన కాంగ్రెస్ పట్టణ నాయకులు, చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మైలారం రాముకు రాఖీ కట్టి,తన అభిమానాన్ని చాటుకొని, ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.అనంతరం ఆమె మాట్లాడుతూ తమ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించింది

# నేనున్నానని... నీకేం కాదని

# అనుబంధాల ప్రతీక రాఖీ

**– తమ సోదరులకు రాఖీలు కట్టాలని దూరపు ప్రాంతాలనుంచి వచ్చిన అక్క చెల్లెలు**

**– సోదరులు ఇచ్చిన కానుకలను ప్రేమతో స్వీకరించిన అక్కా చెల్లెళ్లు**

అక్కా, తమ్ముడు, అన్నాచెల్లెళ్ల ఆత్మీయ బంధానికి ప్రతీక రాఖీ పండుగ. ఒక వేళ దూరంగా ఎక్కడో ఉన్నా పోస్టు ద్వారానైనా అన్నాతమ్ముళ్లకు రాఖీ చేరాల్సిందే. ఆధునిక సమాజంలోనూ రాఖీ పండుగకు ఆ ప్రత్యేకత ఉంది. కులమతాలకు అతీతంగా ఈ రాఖీ పండుగను జరుపుకుంటారు. సోదరికి నేనున్నాననే భరోసా ఈ పండుగ ద్వారా సోదరుడు భరోసా సోదరికి లభిస్తుంది. మేడ్చల్ మండల వ్యాప్తంగా రాఖీ సందడి మార్కెట్లలో నెలకొంది. రోడ్లపై వెలిసిన రాఖీ, మిఠాయిల దుకాణాల వద్ద విక్రయాలు జోరందుకున్నాయి. రెండు రోజుల నుంచే మహిళలు తమ రక్తసంబంధికుల కోసం రాఖీలను కొనుగోలు చేశారు.



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** ఏడాదికి ఏడాది రాఖీల తయారీలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సరికొత్త రూపాల్లో రాఖీలను తయారు చేస్తున్నారు. గోల్డ్, సిల్వర్ రాఖీలను ఆర్డరిచ్చి



తయారు చేయిస్తున్నారు. ఈ సీజన్లో ఫిలిగ్రీ, రెసిన్ రాఖీలకు డిమాండ్ ఎక్కువగా ఉందని వ్యాపారులు పేర్కొన్నారు. నూలు లాంటి బంగారు, వెండి తీగెలతో అల్లే రాఖీలను ఫిలిగ్రీ అని, ఎండిన పూలు, రంగులు, ఫొటోలు, అక్షరాలతో కలిపి చేసే రాఖీలను రెసిన్ అని అంటారు. ఇక వన్ గ్రామ్, కాటన్, కాగితం పూలు, ప్లాస్టిక్, దారాలతో తయారు చేసే సాధారణ రాఖీల విక్రయాలు జరుగుతున్నాయి. సిరామిక్ స్టోన్స్, సిల్వర్ కోటేడ్ ఫ్యాన్సీ రాఖీలు మహిళలను విశేషంగా ఆకట్టుకోగా, బ్యాటరీ బల్బు రాఖీలు, చోట బీమ్ రాఖీలు చిన్నారుల కోసం ఆసక్తిగా కొనుగోలు చేశారు. ముఖ్యంగా గుజరాత్, రాజ్కోట్, కొలకత్తాలకు చెందిన ఫ్యాన్సీ రాఖీలతో పాటు చైనా రాఖీలు అధికంగా విక్రయిస్తున్నారు. ముఖ్యంగా రూ.5 నుంచి రూ.250 వరకు రాఖీలు అందుబాటులో ఉన్నాయి. కొందరు బంగారు, వెండితో చేసిన రాఖీలు కడుతుండగా అదే తరహా బహుమతులను అందిస్తున్నారు అన్నదమ్ములు.

**వారాంతంలో రావడంతో...:**

రాఖీ పండుగ ఈ ఏడాది వారాంతంలో రావడంతో మరింత ప్రత్యేకంగా మారింది. రెండవ శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో ఉత్సాహంగా పండుగ జరపుకున్నారు.



విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వరుస సెలవులు రావడంతో రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు సొంతూళ్లకు రాగా, అన్నదమ్ములకు రాఖీలు కట్టేందుకు అక్కాచెల్లెళ్లకు తీరిగ్గా వెళ్లే అవకాశమొచ్చింది. దీంతో ఆర్టీసీ ప్రాంగణాలు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

**ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు..**

తనను ప్రాణం కంటే మిన్నగా ప్రేమించే అన్నయ్యలంటే ప్రతీ చెల్లికి అభిమానమే. సోదరీ సోదరుల ఆత్మీయతకు అద్దం పట్టేదే రక్షా బంధనం ఇంటి ఆడపడుచు మహాలక్ష్మి స్వరూపంగా, పరాశక్తికి ప్రతీకగా భావించే సంస్కృతి మనది. కష్టసుఖాల్లో మేము మీకు అండగా ఉన్నామన్న భరోసాను సోదరులు అక్కా చెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ చిహ్నానికి, వారి మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిని నేడు ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు ఇంత దూరం ఉన్నా తన అన్న, తమ్ముడు ఉండే ఊరికి వచ్చి రాఖీలు కట్టి మిఠాయి తినిపించారు. అనంతరం అక్కాచెల్లెళ్లకు వారి సోదరులు ఇచ్చే కానుకలను ప్రేమగా స్వీకరించారు

### ఆర్టీసీ చార్జీల పెంపును నిరసిస్తూ

## బీజేపీ నిరసన

కల్వకుర్తి, : రాఖీ పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ కల్వకుర్తిలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. వెంటనే పెంచిన చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ హిందువుల పండుగ సమయంలోనే చార్జీలు పెంచడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి

## అనంతగిరిలో ఘన స్వాగతం

కోదాడ, : రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం అనంతగిరి మండలం శాంతినగర్ ను సందర్శించారు. కోదాడ ఆర్డీఓ సీహెచ్ సూర్య నారాయణ, అనంతగిరి ఎమ్మార్వో హిమ బిందు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. మంత్రి రాకతో గ్రామంలో సందడి నెలకొంది. స్థానికులు ఆయనను కలిసేందుకు, మాట్లాడేందుకు ఉత్సాహం చూపారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించండి

సూర్యాపేట, : వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోదాడ పట్టణ శివ శంకర్ ఒక ప్రకటనలో సూచించారు. ఓవర్ టేక్ చేసేటప్పుడు లేదా వాహనాలు నడిపేటప్పుడు కొద్ది క్షణాలు కూడా ఆగలేకపోతున్నారని, ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాల వేగాన్ని అదుపులో ఉంచుకోవాలని ఆయన తెలిపారు. పండుగ సమయాల్లో కుటుంబాల్లో విషాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలని ఆయన పేర్కొన్నారు.

## రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కామారెడ్డి, : శనివారం కామారెడ్డిలోని శారద పీఠం ఆలయంలో జరిగిన రక్షాబంధన్ వేడుకల్లో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, రక్షాబంధన్ ప్రేమానురాగాలకు ప్రతీక అని, రాగద్వేషాలు వీడి తోటివారితో ప్రేమగా ఉండాలని సూచించారు.

## చంద్రాయన్ పల్లి శివారులో గుర్తుతెలియని శవం

నిజామాబాద్ రూరల్, : నిజామాబాద్ జిల్లా ఇందల్ వాయి మండలంలోని చంద్రయాన్ పల్లి గ్రామ శివారులో శనివారం నేషనల్ హైవే 44 పక్కన గుర్తుతెలియని శవం లభ్యమైంది. శవం కొద్దిగా కుళ్లిపోయి, ముఖంపై రాయిబండతో కొట్టి గుర్తుపట్టలేని విధంగా చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు నేవీ బ్లూ ప్యాంటు, వైట్ బనియన్, వైట్ అండ్ బ్రౌన్ చెక్స్ షర్టు, బ్రౌన్ బెల్ట్ ధరించి ఉన్నాడు. ఎవరైనా మృతుడిని గుర్తించినట్లయితే ఇందల్వాయి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## సామరస్యానికి ప్రతీకగా వైరల్!

బాన్సువాడ, : రక్షాబంధన్ సందర్భంగా, సదాశివనగర్ పోలీస్ స్టేషన్ లోని మహిళా కానిస్టేబుళ్లు అక్కడి పోలీసు అధికారులకు రాఖీలు కట్టారు. ఈ అద్భుతమైన దృశ్యాన్ని ఒక చక్కని పాటతో జోడించి, శనివారం విడుదల చేశారు. ఇది సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతూ, రక్షాబంధన్ యొక్క గొప్పతనాన్ని చాటుతోంది. ఈ సంఘటనలో హిందూ ఎస్ఐలు, ఒక ముస్లిం అధికారి, మరియు మహిళా కానిస్టేబుళ్లు కలిసికట్టుగా ప్రేమ, అనురాగాలను పంచుకున్నారు.

### గౌరారం ఆంజనేయస్వామి

## ఆలయానికి సౌండ్ సిస్టం అందజేత

ఎల్లారెడ్డి, : గౌరారం గ్రామ ఆంజనేయస్వామి ఆలయానికి దేశాయ్ పేట్ కు చెందిన బి. ఎల్లయ్య టీచర్ 7500 రూపాయల విలువైన సౌండ్ సిస్టం ను గ్రామ పెద్దలు హనుమంతరావు పటేల్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులైన అంజయ్య, మైసయ్య, హనుమాన్లు, వీర గౌడ్, లక్ష్మా గౌడ్, విట్టల్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## గంటల తరబడి స్తంభించిన వాహనాలు

కొత్తగూడెం, : రాఖీ పండుగ సందర్భంగా ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీతో ఖమ్మం నగరంలో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఒకే బైపాస్ బ్రిడ్జి ఉండటంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో సమస్య తీవ్రమైంది. ఈ ట్రాఫిక్ ఇబ్బందులను చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన

## గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి, : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శనివారం హన్మకొండలోని తన నివాసం నుండి భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన ఈ పండుగ, రక్త సంబంధానికే కాకుండా ప్రతి బంధానికి వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. సోదరభావం, ఐక్యతను పెంపొందించే ఈ పండుగ స్ఫూర్తితో ప్రజలందరూ ఒకరికొకరు రక్షణగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

### 500 మంది మహిళల రాఖీలతో సమ్మయ్య గౌడ్ భావోద్వేగం!

పాలకుర్తి, : కేసముద్రం మండల కేంద్రంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ కు సుమారు 500 మంది మహిళలు రాఖీలు కట్టి, 'నీవు మాకు రక్షా, మేము మీకు రక్షా' అని తెలిపారు. వారి అభిమానానికి సమ్మయ్య గౌడ్ భావోద్వేగానికి లోనై, జన్మంతా వారికి రుణపడి ఉంటానని, మహిళల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం అందుకున్నారు.

### వీరన్నగూడెం ఆలయంలో

## ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి

పటాన్‌చెరు,: గుమ్మడిదల మున్సిపాలిటీ వీరన్నగూడెం గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, పండితులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

### ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి

## రాఖీలు కట్టిన సోదరీమణులు

ఆందోల్, : సోదరసోదరీల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శనివారం తన నివాసానికి వచ్చిన సోదరీమణులు నర్సమ్మ, సువర్ణల చేతుల మీదుగా రాఖీలు కట్టించుకున్నారు. ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డికి కూడా రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదర అనుబంధం గురించి తెలియజేశారు.

### భారీ వర్షాలు కురుస్తున్నందున

## అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచన

సంగారెడ్డి, : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, కుంటల వద్దకు వెళ్లవద్దని కలెక్టర్ ప్రావిణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, చెరువుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు.

## క్విట్ ఇండియా దినోత్సవం

మహబూబ్‌నగర్, : క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశ స్వాతంత్ర్యానికి కాంగ్రెస్ పార్టీ, మహాత్మా గాంధీతో పాటు నెహ్రూ, పటేల్, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి నాయకులు చేసిన పోరాటాలను ఆయన గుర్తు చేశారు. అనంతరం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంస్కృతి, హక్కుల కోసం పోరాటం



బెల్లంపల్లి, : బెల్లంపల్లి మండలం గోండుడగూడ తండాలో ఆదివాసీలు ఘనంగా ఆదివాసీ దినోత్సవం జరుపుకున్నారు. జెండా ఎగురవేసి, డోలు వాయిద్యాలతో సంస్కృతిని చాటుకున్నారు. మాతృభూమితో మమేకమైన జీవన విధానం, సంప్రదాయాల సంరక్షణకు ఆదివాసీలు నిలువెత్తు నిదర్శనమని వారు పేర్కొన్నారు. అదే సమయంలో, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ఆపాలని, పోడు భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## బెల్లంపల్లిలో కుండపోత వర్షం

మంచిర్యాల, : బెల్లంపల్లి మండలంలో శనివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఇది ఉపశమనం కలిగించింది. ముఖ్యంగా పంటలు వేసుకున్న రైతులకు ఈ భారీ వర్షం ఎంతో మేలు చేస్తుందని, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం వల్ల జనజీవనం కొంత మేర స్తంభించినా, వ్యవసాయదారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

## హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు

చెన్నూరు, : హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళా కానిస్టేబుళ్లు ప్రియాంక, అమ్రీన్ బోగంలు ఎస్సై స్వరూప్ రాజ్, ఏఎస్సై చాంద్ పాషా, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుళ్లకు రాఖీలు కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సభ్యులు మిఠాయిలు పంచుకున్నారు. ఈ పండుగ తోబుట్టువుల ఆత్మీయ బంధానికి ప్రతీక అని ఎస్సై స్వరూప్ రాజ్ పేర్కొన్నారు.

### పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో

## సామూహిక యజ్ఞోపవీత ధారణ

సిర్పూర్, : రాఖీ పౌర్ణమి పర్వదినాన కాగజ్ నగర్ పట్టణ పద్మశాలి భవన కమిటీ ఆధ్వర్యంలో ఎల్లా గౌడ్ తోటలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో సామూహిక యజ్ఞోపవీత ధారణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గణపతి, మార్కండేయ పూజలు, అభిషేకం, గాయత్రి హోమం అనంతరం యజ్ఞోపవీత ధారణను నిర్వహించారు. ఈ శుభకార్యంలో కంపెల్లి సుదర్శన్ దంపతులు, సిందం చంద్రయ్య, రాపెల్లి సదానందం, గుల్లపెల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ భూముల ఆక్రమణదారులపై చర్యలు

ఆసిఫాబాద్, : కాగజ్‌నగర్ అటవీ కార్యాలయంలో ఎఫ్డీఓ సుశాంత్ బోబ్డే శనివారం మాట్లాడుతూ, పెద్ద మొత్తంలో అటవీ భూములను ఆక్రమించిన వారిపైనే కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అమాయక రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించడం లేదని స్పష్టం చేశారు. కర్జెల్లి రేంజిలో కొన్ని గిరిజనేతర కుటుంబాలు వందల ఎకరాల అటవీభూమిలో అక్రమంగా సాగు చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అడవులను పరిరక్షిస్తేనే వన్యప్రాణుల మనుగడ సాధ్యమని ఆయన నొక్కి చెప్పారు.

### బూరుగుపల్లి గ్రామంలో

## బస్ షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు




సిరిసిల్ల, : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో బస్ షెల్టర్ లేక స్థానిక ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నిలువ నీడలేక ఎండలు మండుతున్న బస్ కోసం నిరీక్షిస్తూ రోడ్డు మీదనే పడిగాపులు కాస్తున్నారు. ముఖ్యంగా ఆడవాళ్ళకు అసౌకర్యం కలుగుతుంది. ఎన్నో ఏళ్ళుగా ఇప్పటి వరకు అధికారుల అలసత్వంతో గ్రామంలో బస్ షెల్టర్ నిర్మాణం కాలేదు. ఇకనైనా ప్రజల సౌకర్యాన్ని గుర్తించి అధికారులు స్పందించి సకాలంలో బస్టాండ్ ప్రాంతంలో బస్ షెల్టర్ నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## రామగుండం ఈనెల 10న రెవెన్యూ మేళా

రామగుండం, : 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక భాగంగా ఈ నెల 10న రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ మేళా నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ శ్రీ తెలిపారు. ఈ మేళలో ఆస్తి పన్ను సంబంధిత సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తు స్వీకరిస్తామన్నారు. సాధ్యమంత వరకు వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్‌పై బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు

కరీంనగర్, : ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ శనివారం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాధాకిషన్ రావు స్టేట్‌మెంట్‌లో కేసీఆర్ పేరు ఉందని, రాధాకిషన్, ప్రవీణ్‌రావులు ఫోన్ లు విన్నారని ఆయన ఆరోపించారు. హైకోర్ట్ జడ్జిలు, భార్యాభర్తలు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేసి బ్లాక్‌మెయిల్ చేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్, కేటీఆర్‌లను విచారణకు పిలవాలని, రాష్ట్ర విచారణపై నమ్మకం లేనందున సీబీఐ దర్యాప్తు అవసరమని బండి సంజయ్ అన్నారు.

### ఎమ్మెల్యే జారే

## ఆదినారాయణ అభినందనలు

పినపాక, : హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొన్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆదివాసి సోదర, సోదరీమణుల సాంస్కృతిక సంపద, జీవన విధానం, సంప్రదాయాలపై హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆదివాసి సమాజ అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను బలోపేతం చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఆదివాసి హక్కుల పరిరక్షణలో ముందుంటానని ఆయన స్పష్టం చేశారు.

# మద్యం కేసులో జగన్ ఫ్యామిలీ

**విజయవాడ :** ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో.. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటయింది. దాదాపు ఈ కేసులో 40 మంది వరకు నిందితులు ఉన్నారు. ఓ 12 మంది అరెస్టు అయ్యారు. మరి కొంతమంది పరారీలో ఉన్నారు. ఈ కేసులో ఏ 5 నిందితుడిగా ఉన్నారు విజయసాయిరెడ్డి. ఆయన అరెస్టు ఇంతవరకు జరగలేదు. ఈ కేసులో తొలుత అరెస్ట్ అయ్యారు రాజ్ కసిరెడ్డి. అనంతరం వైసీపీ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారిగా పని చేసిన ధనుంజయ రెడ్డి, జగన్ ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి, జగన్ సన్నిహితుడు బాలాజీ గోవిందప్ప రెస్ట్ అయ్యారు. అటు తర్వాత మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అదుపులోకి తీసుకుంది సిట్. అక్కడకు కొద్ది రోజులకే రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. దీంతో ఇక తదుపరి అరెస్టు జగన్మోహన్ రెడ్డి దేనని ప్రచారం నడిచింది. అయితే ఈ కుంభకోణంలో జగన్ కుటుంబ సభ్యులకు సైతం ప్రముఖంగా వినిపించాయి.తొలి ఛార్జ్ షీట్లో జగన్మోహన్ రెడ్డి పేరు ప్రస్తావనకు తరచూ వచ్చింది. దీంతో అంతిమ లబ్ధిదారుడు ఆయనేనన్న టాక్ వినిపించింది. జగన్ అరెస్టు జరుగుతుందని కూడా ప్రచారం జరిగింది. అయితే ఇది రాజకీయ కక్షపూరిత కేసుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానించింది. ఈ కేసు నిలబడదని కూడా చెప్పుకొచ్చింది. కానీ ప్రత్యేక దర్యాప్తు బృందం లోతైన విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో లిక్కర్ కుంభకోణంలో ఉన్న నిందితులకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సోషల్ మీడియాలో దర్శనం ఇచ్చాయి. ఈ కేసులో నిందితుడిగా ఉన్న వెంకటేష్ నాయుడు డబ్బుల నోట్ల కట్టలు లెక్కబెడుతూ కనిపించిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. మరోవైపు చార్టెడ్ ఫ్లైట్లో ప్రముఖ హీరోయిన్ తో ఉన్న సెల్ఫీ కూడా హల్చల్ చేసింది. ప్రత్యేక విమానంలో డబ్బుల నోట్ల కట్టలు తరలిస్తున్న ఫోటోలు అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇవన్నీ మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొమ్ము అని.. తాడేపల్లి ప్యాలెస్ కు తరలించే ప్రయత్నంలో భాగంగా చిక్కిన ఫోటోలేనని టిడిపి కూటమి ఆరోపిస్తోంది. అయితే సిట్ చేతికి ఇలాంటి ఫోటోలు, వీడియోలు చాలా చిక్కినట్లు ప్రచారం నడుస్తోంది.అయితే ఈ లిక్కర్ కుంభకోణంలో ప్రధాన నిందితులంతా జగన్మోహన్ రెడ్డికి బంధువులేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేసులో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి అని అందరికీ తెలిసిన విషయమే. అయితే ఆయన జగన్మోహన్ రెడ్డికి సమీప బంధువు అని టిడిపి సీనియర్ నేత ఆనం వెంకట రమణారెడ్డి వెల్లడించారు. 2019 ఎన్నికలకు ముందు రాజ్ కసిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలా చేరిన మరుక్షణం ఆయన జగన్మోహన్ రెడ్డి కోటరీలో చేరిపోయారు. మద్యం కంపెనీలు నిర్వహించే రాజ్ కసిరెడ్డికి జగన్ ఈమధ్య కుంభకోణం బాధ్యతలు అప్పగించినట్లు వెంకట రమణారెడ్డి ఆరోపించారు. అయితే రాజ్ కసిరెడ్డి ఎవరో కాదని.. వైయస్ సుజాత రెడ్డి స్వయానా అల్లుడని సంచలన ప్రకటన చేశారు ఆనం. స్వయానా మేనత్త అల్లుడు కావడం, మద్యం వ్యాపారంలో అనుభవం ఉండడంతోనే జగన్ తన కోటరీలోకి రాజ్ కసిరెడ్డిని తీసుకొచ్చారని టిడిపి నేత తాజాగా ఆరోపించారు. తద్వారా ఈమద్యం కుంభకోణంలో వైయస్ కుటుంబ సభ్యుల హస్తం ఉందని ఆరోపిస్తోంది తెలుగుదేశం పార్టీ.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీని మార్చారు. ప్రభుత్వమే నేరుగా మద్యం దుకాణాలు నడిపించింది. ఈ తరుణంలో మద్యం తయారు చేసే కంపెనీలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. డిష్టలరీలను సైతం తమ చెప్పు చేతల్లోకి తెచ్చుకొని.. భారీగా కమిషన్లు దండుకున్నారని తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే అనుమానం వ్యక్తం చేసింది. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. దాదాపు 18 వేల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని.. 3500 కోట్ల రూపాయలు వైసీపీ నేతలు కొల్లగొట్టారని సిట్ తేల్చింది. అయితే ఈ మొత్తం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు జగన్ అన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే మద్యం కుంభకోణమే అన్నదే జరగలేదని వైసిపి ఆరోపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డికి రాజ్ కసిరెడ్డి సమీప బంధువు అని తేలడం మాత్రం కొత్త మలుపు తిరిగినట్లు అయింది. ఈ అంశాన్ని టిడిపి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. మొత్తానికైతే మద్యం మకిలి జగన్ కుటుంబానికి అంటిందన్నమాట. చూడాలి మరి ఏం జరుగుతుందో..?

## విద్యుత్ వినియోగదారులకు
# మరో అవకాశం

**విజయవాడ :** కరెంట్ వినియోగదారులకు ఏపీఈఆర్‌సీ మరోసారి అద్భుత అవకాశం కల్పించింది. అదనపు లోడును క్రమబద్ధీకరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ గడువు పొడిగించింది. గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరించుకునేందుకు తొలుత జూన్ 30 వరకూ సమయం ఇచ్చారు. అయితే ఈ పథకంపై సరైన అవగాహన లేకపోవటంతో చాలా మంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో విద్యుత్ అదనపు లోడు స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకునేందుకు డిసెంబర్ 31వ తేదీ వరకూ గడువు ఇచ్చింది. ఈలోపు అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకున్నవారికి కరెంట్ ఛార్జీలలో 50 శాతం వరకూ రాయితీ అందించనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కార్యదర్శి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణ పథకంపై ప్రచారం, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.సాధారణంగా మనందరం ఇళ్లల్లో కరెంట్ బల్బులు, ఫ్యాన్లు, ఏసీలు, టీవీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు వంటివి ఉపయోగిస్తూ ఉంటాం. దీంతో ఇళ్లల్లో కరెంట్ వాడకం రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో విద్యుత్ కనెక్షన్ కోసం అప్లై చేసుకున్న సమయంలో నమోదు చేసిన కరెంట్ లోడ్ కంటే ఈ మొత్తం దాటిపోతోంది. దీంతో ఈ అదనపు భారం రెగ్యులేటరీల మీద పడుతోంది. దీంతో విద్యుత్ సరఫరాలో సమస్యలు, లోఓల్టేజ్ ఇష్యూలు వస్తున్నాయి. దీంతో అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు అధికారులు అవకాశం కల్పిస్తున్నారు.అయితే సాధారణంగా గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి.. అదనపు లోడ్ కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ ఛార్జీ కింద రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సెక్యూరిటీ డిపాజిట్‌గా రెండు వందల రూపాయలు.. దీనికి తోడు దరఖాస్తుకు రూ.50 కలిపి మొత్తంగా రూ.2,500 వరకూ వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది. అదనపు ఖర్చుల కింద మరో రూ.250 అధికం. అయితే అదే ఇప్పుడు ఉన్న పథకం ప్రకారం స్వచ్ఛందంగా విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకునే వారు రూ.1,250 చెల్లిస్తే చాలు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు తొలుత జూన్ 30 వరకూ సమయం ఇచ్చారు. ఆ గడువు ముగిసిపోగా.. తాజాగా ఈ గడువును డిసెంబర్ 31 వరకూ పొడగించారు.

# రొయ్యల సాగుకు అమెరికా షాక్

అమెరికా రొయ్యల దిగుమతులపై అదనంగా 25% సుంకం విధించడంతో భారతదేశంలోని ఆక్వా రైతులకు, వ్యాపారులకు భారీ దెబ్బ తగిలింది. ఈ కొత్త సుంకాల వల్ల దేశంలో రొయ్యల సాగు రంగం భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన నెలకొంది. మన రొయ్యల ధరలు పెరిగితే, ఈక్వెడార్ లాంటి దేశాలు ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ సంక్షోభం నుంచి బయటపడాలంటే భారత్ ఎలాంటి చర్యలు తీసుకోవాలి?ఇప్పటికే మన దేశ రొయ్యల ఎగుమతులపై అమెరికా 8% వరకు యాంటీ-డంపింగ్, కౌంటర్‌వైలింగ్ సుంకాలను విధిస్తోంది. ఇప్పుడు కొత్తగా విధించిన 25% సుంకం కలవడంతో మొత్తం పన్ను భారం 33%కి పెరిగింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న ఈ టారిఫ్‌లను ప్రకటించడానికి ముందు ఈ సుంకం కేవలం 7.5% మాత్రమే ఉండేది.2011 నుంచి 2023 వరకు, భారత రొయ్యల సాగు రంగం ఏటా సగటున 18% వృద్ధిని నమోదు చేసింది. ఈ అద్భుతమైన వృద్ధికి ప్రధాన కారణం ఎగుమతులే. ముఖ్యంగా అమెరికా నుంచి ఉన్న అధిక డిమాండ్ ఈ వృద్ధికి కీలక పాత్ర పోషించింది.2023-24లో భారతదేశం అమెరికాకు ?2.5 బిలియన్ల విలువైన రొయ్యలను ఎగుమతి చేసింది. ఇది అమెరికా మొత్తం రొయ్యల దిగుమతుల్లో దాదాపు 38% వాటా. ఈక్వెడార్ (21%), ఇండోనేషియా (17%), వియత్నాం (11%) మన తర్వాత స్థానాల్లో ఉన్నాయి.అయితే, ఇప్పుడు పోటీ తీవ్రంగా మారింది. ఈక్వెడార్ ప్రస్తుతం 18% సుంకాన్ని మాత్రమే ఎదుర్కొంటోంది. ఇండోనేషియాకు 35% నుంచి 25.3%కి, వియత్నాంకు 46% నుంచి 20%కి సుంకాలు తగ్గాయి.భారత్‌కు మాత్రం సుంకం 33%కి చేరడంతో, మన అతిపెద్ద పోటీదారు అయిన ఈక్వెడార్‌తో పోలిస్తే 14-15 శాతం ప్రతికూలత ఏర్పడింది. ఈ భారీ సుంకాల అంతరం అమెరికా మార్కెట్‌లో మన పోటీతత్వాన్ని, వాటాను తగ్గించే ప్రమాదం ఉంది. దీనివల్ల మన ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ కంపెనీలు, రైతులపై తీవ్ర ఒత్తిడి పడుతుంది.ఈ సుంకాల పెంపుకు ముందే భారత దేశంలో రొయ్యల రైతులు అధిక ఉత్పత్తి ఖర్చులతో సతమతమవుతున్నారు. మొత్తం ఉత్పత్తి ఖర్చులో 60% వరకు రొయ్యల మేతకే పోతుంది. గత మూడేళ్లలో మేత ధరలు 25-30% పెరిగాయి. దీనికి కారణం చేపల పిండి, సోయాబీన్ వంటి మేత పదార్థాల ధరలు పెరగడం, రూపాయి విలువ తగ్గడం.తెల్ల రొయ్య సాగు చేసే చిన్న, మధ్య తరగతి రైతులకు సగటు ఉత్పత్తి ఖర్చు కిలోకు ?280- ?300కి చేరింది. అయితే, కిలో సగటు అమ్మకపు ధర ?340 నుంచి ?360 మధ్య ఉంది. దీంతో లాభాలు చాలా తక్కువగా ఉన్నాయి.

ఒకవేళ అమ్మకపు ధర ?280 కన్నా తగ్గితే, చాలా మంది రైతులు నష్టాల్లో కూరుకుపోతారు.ప్రస్తుతం పండుగల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎగుమతి కోసం స్టాక్ చేస్తున్న నేపథ్యంలో, భారత ఎగుమతిదారులు ఈ అదనపు సుంకాల భారాన్ని భరించాల్సి రావచ్చు. ఇది వారి లాభాలను మరింత తగ్గిస్తుంది. చివరికి ఈ ప్రభావం తక్కువ లాభాలతో పనిచేస్తున్న రైతులపై పడుతుంది.ఈ సంక్షోభం దేశంలో రొయ్యల సాగుకు కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. మన రాష్ట్రం దేశంలో మొత్తం రొయ్యల ఉత్పత్తిలో 82% కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. ఆ తర్వాత ఒడిశా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్ వంటి రాష్ట్రాలు ఉన్నాయి.ఇది కేవలం తీర ప్రాంతాలకే పరిమితం కాదు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద హర్యానా, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఉప్పునీటి ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఈ రాష్ట్రాల్లోని రైతులు తమ లవణీయత గల భూములను సాగుకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఎగుమతులు నిలిచిపోతే, కొత్తగా ఈ రంగంలోకి వచ్చిన ఈ రైతులు అమెరికా సుంకాలు తగ్గించడం కోసం ప్రభుత్వం చర్చలు జరపడం ఒక మార్గం. ఒకవేళ అధిక సుంకాలు కొనసాగితే, భారత్ ఈ సంక్షోభాన్ని ఒక హెచ్చరికగా తీసుకోవాలి.రొయ్యల ఎగుమతి మార్కెట్లను విస్తరించుకోవాలి. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలి, దేశీయంగా రొయ్యల వినియోగాన్ని ప్రోత్సహించాలి.అమెరికాను మించి తూర్పు ఆసియా, యూరోపియన్ యూనియన్, యూకే, పశ్చిమ ఆసియా లాంటి మార్కెట్లపై దృష్టి పెట్టాలి. ఇటీవల భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలోని సుంకాల ప్రయోజనాలను ఉపయోగించుకుని యూకేకు రొయ్యల ఎగుమతులను పెంచుకునే అవకాశం ఉంది.రొయ్యలకు బ్రాండింగ్ కల్పించి, విదేశీ మార్కెట్లలో అభివృద్ధి చేయడంలో మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ కీలక పాత్ర పోషించవచ్చు. చిన్న రైతులకు రుణ సౌకర్యాలు, బీమా సౌకర్యాలు మెరుగుపరచాలి.దేశంలో రొయ్యల వినియోగాన్ని పెంచడం కూడా అంతే అవసరం. రొయ్యల పోషక విలువలను ప్రచారం చేయడం ద్వారా భారతీయ మాంసాహార ప్రియులకు చేరువ చేయవచ్చు.

# సేమ్ డే శ్రీ వాణి ద్వారా దర్శనం

తిరుమల : తిరుమల శ్రీవారి దర్శనం కోసం ప్రత్యేకంగా వీఐపీల సౌకర్యార్థం అమలు చేస్తున్న శ్రీవాణి టిక్కెట్ల కేటాయింపులను భక్తులకు మరింత చేరువ చేసే దిశగా మెరుగైన సౌకర్యాలను అందించేందుకు టీటీడీ ఆధునిక పద్ధతులను ఆలంబిస్తోంది. ఆఫ్లైన్ విధానంలో ప్రతిరోజు 800 టికెట్లను తిరుమలలో కేటాయిస్తున్న పద్ధతిని భక్తులకు సౌకర్యవంతంగా ఇటీవలే మార్పులు చేపట్టారు. 10.500 రూపాయలు చెల్లిస్తున్న ఈ సౌకర్యాల కల్పనలో టీటీడీ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిహెచ్ వెంకయ్య చౌదరి భక్తుల ఇబ్బందులను స్వయంగా పరిశీలించి అధ్యయనం చేసిన అనంతరం ఇకపై శ్రీవాణి టికెట్లను క్యూ లైన్ లో గంటలు తరబడి వేచి ఉండి ఇబ్బందులు పడకుండా భక్తులకు సుదర్శనం టోకెన్ల కంకణాల తరహాలో భక్తులకు ముంజేతికి డిజిటల్ టోకెన్లను కట్టేలాగా నిర్ణయం తీసుకున్నారు.

ఉదయాన్నే ఈ టోకెన్లు పొందిన భక్తులు గంటల తరబడి వేచి ఉండే అవసరం లేకుండా వారి ఇతరత్రా పనులు చూసుకుని దర్శనానికి వెళ్లే సమయంలోపుగా ఏ సమయంలోనైనా టికెట్లు పొందే అవకాశాన్ని కల్పిస్తారు. ఇందుకోసం ఉదయాన్నే క్యూలైన్లో వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ అనే పద్ధతిలో 800 మంది భక్తులకు టోకెన్ తరహాలో డిజిటల్ కంకణాన్ని చేతికి కడతారు. అందులో సీరియల్ నెంబర్ తో పాటు భక్తుల వివరాలు కూడా సిస్టంలో నమోదు చేసిన అనంతరం పంపిణీ చేస్తారు. మరో వారం రోజులు లోపుగా ఈ తాజా నిర్ణయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులతో అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిహెచ్ వెంకయ్య చౌదరి ఏర్పాట్లపై సమీక్షిస్తున్నారు.ప్రస్తుతం శ్రీవాణి టికెట్లను పొందేందుకు తిరుమలలోని హెచ్ వి డి సి ప్రాంతంలో ప్రత్యేకంగా ఆధునికరించిన కార్యాలయాన్ని కూడా కొద్ది రోజుల క్రితమే ప్రారంభించారు.

ఇక్కడ శ్రీవాణి టికెట్లను తీసుకున్న రోజు కాకుండా మరుసటి రోజున శ్రీవారి దర్శనాన్ని కల్పించే పద్ధతికి స్వస్తి పలికి ఏ రోజు కా రోజు ఉదయం టికెట్లు తీసుకుంటే సాయంత్రం నాలుగు గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతించే విధంగా ఇటీవలే మార్పులు తీసుకొచ్చారు.అయినప్పటికీ రోజు రోజుకి శ్రీవాణి టికెట్లకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ టికెట్లను పొందేందుకు ఉదయం 6 గంటల నుండి భక్తులు క్యూ కడుతున్నారు. అయితే టీటీడీ మాత్రం ఉదయం 10 గంటలకు టికెట్ల పంపిణీ ప్రారంభిస్తోంది. నాలుగు లైన్లతో కూడిన టికెట్ల కౌంటర్లను శ్రీవాణి టికెట్లు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అయినప్పటికీ భక్తుల తాకిడి అధికం కావడం చివరకు ఎనిమిది వందల టికెట్లు కేటాయింపు పూర్తయి మిగిలిన వారికి మొండి చేయి చూపాల్సి రావడం పై టీటీడీ అధికారులకు ఒక విధంగా ఒత్తిడి ఏర్పడుతోంది. ఒత్తిడి మాట ఎలా ఉన్నా భక్తులకు గంటలు గంటలు వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా శ్రీవాణి టిక్కెట్ల కేటాయింపుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి పది నిమిషాల్లో టికెట్లు పొంది సౌకర్యంగా దేవుడు దర్శనానికి వెళ్లే విధంగా అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి ఏర్పాట్లు చేపట్టారు.

# కాంగ్రెస్‌లోకి గల్లా ఫ్యామిలీ..

**గుంటూరు :** ఏపీలోకాంగ్రెస్ బలోపేతం దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టిందా? భారీ వ్యూహం రూపొందిస్తోందా? ఈ విషయంలో ఏపీలో అధికార కూటమి కూడా అదే కోరుకుంటుందా? కాంగ్రెస్ పార్టీ బలపడితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీన పడుతుందని అంచనా వేస్తోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా షర్మిల ఉన్నారు. అయితే ఆమె నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలపడకపోవడంపై అనేక ఫిర్యాదులు వెళు తున్నట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీలో ఒక బలమైన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీలోకి తెస్తే బాగుంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. వారికి తెచ్చి నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే పార్టీ బలోపేతం కావడం ఖాయమని టాక్. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకత్వం ఆ కుటుంబంతో చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. మరోవైపు ఈ విషయంలో కూటమి సైతం అంతర్గతంగా సహకారం అందిస్తున్నట్లు సమాచారం.ఏపీలో కాంగ్రెస్ పార్టీకి ఎనలేని ఆదరణ ఉండేది. సుదీర్ఘకాలం ఈ రాష్ట్రాన్ని పాలించింది కాంగ్రెస్ పార్టీ. కానీ ఎన్టీఆర్ టిడిపిని ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటూ వచ్చింది. అయినా సరే టిడిపి ప్రభంజనాన్ని తట్టుకొని మరి నిలబడింది. అయితే ఇలా తట్టుకోవడం వెనుక బలమైన కుటుంబ నేపథ్యం ఉన్న నేతలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారు. అందులో పాతూరి రాజగోపాల్ నాయుడు ఒకరు. ఆయన కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు. కృషికర్ లోక్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి ఎమ్మెల్యే అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరి రెండుసార్లు చిత్తూరు నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. ఆయన వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చారు గల్లా అరుణకుమారి. ఈమె అమర్ రాజా కంపెనీ ఫౌండర్ గల్లా రామచంద్ర నాయుడు భార్య. తండ్రి వారసత్వంగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా అయ్యారు. పదేళ్లపాటు మంత్రిగా కూడా కొనసాగారు. రాష్ట్ర విభజనతో 2014లో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆమె కుమారుడు గల్లా జయదేవ్ 2014, 2019లో గుంటూరు ఎంపీగా గెలిచారు. 2024 ఎన్నికలకు ముందు క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెప్పారు. ఆ ఎన్నికల్లో పోటీ చేయలేదు.ప్రస్తుతం గల్లా కుటుంబం రాజకీయంగా సైలెంట్ గా ఉంది. అయితే ఆ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఏ పీసీసీ అధ్యక్షులపై కూడా ఈ స్థాయిలో ఫిర్యాదులు లేనట్లు తెలుస్తోంది. షర్మిల సీనియర్లను కలుపుకొని వెళ్లడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆమె బాధ్యతలు తీసుకుని దాదాపు రెండేళ్లు అవుతోంది. పార్టీ నుంచి బయటకు వెళ్లిన నేతలే తప్ప.. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే నాయకులు కనిపించడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో గల్లా ఫ్యామిలీని కాంగ్రెస్ పార్టీలోకి తెచ్చి నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే మేలన్న నిర్ణయానికి హై కమాండ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ పెద్దలు గల్లా కుటుంబంతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. 2029 ఎన్నికల్లో రాహుల్ గాంధీ తప్పకుండా ప్రధాని అవుతారని.. ఏపీలో మీకు మంచి భవిష్యత్తు ఉంటుందని వారితో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ విషయంలో చంద్రబాబుసహకారం కూడా కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయి. గల్లా జయదేవ్ తో పాటు అరుణకుమారి చంద్రబాబుకు సన్నిహితులు. వారి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. అయితే 2018లో బిజెపితో కటీఫ్ చెప్పింది టిడిపి. 2019 ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూడడంతో తెలుగుదేశం పార్టీ బిజెపికి టార్గెట్ అయింది.

ఈ క్రమంలోనే పారిశ్రామికవేత్త అయిన గల్లా జయదేవ్ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంతోనూ.. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంతోనూ ఇబ్బందులు పడ్డారు. అందుకే క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై ప్రకటించారు. అయితే ఓ పారిశ్రామికవేత్తగా, చరిష్మ ఉన్న కుటుంబం గా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తీసుకుంటే తప్పకుండా ఆ ప్రభావం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై పడుతుంది. కాంగ్రెస్ పార్టీకి సరైన నాయకుడు వస్తే వైసీపీలో అసంతృప్తి నేతలు సైతం ఆ పార్టీలో చేరే అవకాశం ఉంది. అందుకే ఈ విషయంలో చంద్రబాబు సైతం ఒప్పిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# రేవంత్ కొత్త రాజకీయం

**హైదరాబాద్ :** జల్సా సినిమాలో డైలాగ్ ఉంటుంది గుర్తుందా.. శత్రువును ఓడించడం అంటే చంపడం కాదు.. గెలవడం.. చాలామందికి ఇది అర్థం కాదు గాని.. దీనిని అర్థమయ్యేలా నిరూపించి చూపిస్తున్నాడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్. " కెసిఆర్ ను చర్లపల్లి జైలుకు పంపించడం ఎందుకు.. ఆయనకు ఫామ్ హౌస్ లో ఉండడమే పెద్ద శిక్ష. నన్ను ఓ చిన్న స్థాయి లీడర్ అని అనుకున్నాడు. తొక్కి తొక్కి అధపాతాళానికి పంపించానని అనుకున్నాడు. చివరికి నా చేతిలోనే ఆయన ఓడిపోయాడు. ఇంతకు మించిన శిక్ష ఇంకేం ఉంటుందని" రేవంత్ ఇటీవల వ్యాఖ్యానించడం విశేషం. తెలంగాణ ముఖ్యమంత్రి మాట్లాడిన మాటల ద్వారా కేసిఆర్ ను జైలుకు పంపించే ఉద్దేశం లేదని తెలుస్తోంది.

అలాంటి ఉద్దేశం లేని పక్షంలో కమిషన్లను ఎందుకు ఏర్పాటు చేశారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.గొర్రెల పథకం, కాళేశ్వరం, గత ప్రభుత్వం చేపట్టిన వివిధ పనులపై రేవంత్ కమిషన్లను ఏర్పాటు చేశారు. విచారణ అధికారులు ఇప్పటికే కాళేశ్వరం, గొర్రెల కుంభకోణం లో తుది నివేదికలు ఇచ్చారు. ఇందులో అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి ఓ ఎస్ డి గా పనిచేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాళేశ్వరం కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన మురళీధర్, హరి రామ్ నాయక్ ఏసీబీ అదుపులో ఉన్నారు.. ఇంకా ఈ కేసులో మరిన్ని తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని సాక్షాత్తు గులాబీ అధిపతి అన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇంత మందిని అరెస్టు చేస్తున్నప్పటికీ కెసిఆర్ జోలికి తెలంగాణ ముఖ్యమంత్రి వెళ్లకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. "ప్రత్యర్థి కుంగి కృశించి.. నన్ను వదిలేయ్.. ఈ ఓటమిని నేను తట్టుకోలేను. ఈ జాలిని నేను భరించలేను.. అనేతీరుగా కెసిఆర్ విషయంలో రేవంత్ వ్యవహరిస్తున్నారని" రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.రేవంత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు.. అంతకుముందు టిడిపి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కెసిఆర్ టార్గెట్ చేసి వేధించారు.

ఇబ్బంది పెట్టారు. పర్యాయాలు జైలుకు కూడా తరలించారు. చివరికి ఆయన కూతురు వివాహం ఉన్నప్పటికీ కేసీఆర్ వదిలిపెట్టలేదు. తనను అంతటి ఇబ్బందులకు గురిచేసిన సమయంలో రేవంత్ అనేక పర్యాయాలు కేసిఆర్ ను జైలుకు పంపిస్తానని హెచ్చరికలు జారీ చేశారు. గజ్వేల్ లో కూడా తొడగొట్టి ఇదే తీరుగా సవాల్ కూడా విసిరారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ వ్యవహార శైలి ఒక్కసారిగా మారిపోయింది. కెసిఆర్ విషయంలో రేవంత్ జాలి ప్రదర్శిస్తున్నారు. ఉదారతను చూపిస్తున్నారు. అదుపులోకి తీసుకునే అవకాశం వచ్చినప్పటికీ.. ఆ దిశగా అడుగులు వేయడం లేదు.రేవంత్ చేస్తున్న పని జాలి కాదని.. మానసికహింస అని తెలుస్తోంది.

వాస్తవానికి కెసిఆర్ 2023 ఎన్నికల ఫలితాలను జీర్ణించుకోలేకపోయారు. తన రాజీనామా లేఖను గవర్నర్ కు ఇవ్వడానికి కూడా ఇష్టపడలేదు. రేవంత్ ముఖ్యమంత్రి కావడాన్ని కెసిఆర్ అసలు జీర్ణించుకోలేకపోయారు. అయినప్పటికీ రేవంత్ కెసిఆర్ ఆసుపత్రిలో ఉన్నప్పుడు ఆయన క్షేమం కోరి పరామర్శించారు.. ప్రభుత్వపరంగా ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షించారు. రేవంత్ చేతిలో అధికారం ఉన్నప్పటికీ ప్రత్యర్థుల విషయంలో ఏమాత్రం దూకుడు కొనసాగించడం లేదు. ప్రతీకారం తీర్చుకోవడం లేదు.. కాకపోతే ప్రత్యర్థులను ఎలా హింసించాలో అలానే హింసిస్తున్నారు. అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా అరెస్టు చేయడం లేదు. ఎందుకంటే అలా అరెస్టులు చేస్తే ప్రజల్లో సానుభూతి పెరుగుతుంది. అందువల్లే ప్రత్యర్థులపై మానసికంగా పగ తీర్చుకుంటున్నారు రేవంత్. రాజకీయాలలో సరికొత్త స్టైల్ అవలంబిస్తున్నారు.

# లీజుకు ఏపీటీడీసీ హోటళ్లు, రిసార్ట్‌లు

**విజయవాడ :** పర్యాటకాభివృద్ధికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 22 ఏపీటీడీసీ హోటళ్లు, రిసార్ట్‌లను 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని నిర్ణయించింది. ఆరు క్లస్టర్లుగా విభజించి టెండర్ల ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించనున్నారు. పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. అలాగే ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగాలు పోకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కి చెందిన 22 హోటళు ,, రిసార్ట్‌ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఆరు క్లస్టర్లలోని ఈ హోటళ్లను 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వనున్నారు. టెండర్ల ప్రక్రియను పూర్తి చేయడానికి ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు ప్రభుత్వం అధికారం ఇచ్చింది. పర్యాటకులకు మంచి వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేట్ సంస్థల నుంచి వచ్చే స్పందనను (ప్రీ బిడ్ సమావేశాల్లో) బట్టి టెండర్ల ప్రక్రియలో స్వల్ప మార్పులు చేసే అధికారాన్ని ఎండీకి ప్రభుత్వం ఇచ్చింది.తాజాగా కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. హోటళ్లు, రిసార్ట్‌ల నిర్వహణలో అనుభవం ఉన్న సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. లీజుకు తీసుకునే సంస్థలు స్థూల ఆదాయంలో 12% లేదా ఏపీటీడీసీ నిర్ణయించిన కనీస వార్షిక అద్దెలో ఏది ఎక్కువైతే దానిని చెల్లించాల్సి ఉంటుంది. దీనినే "ఇంటర్నల్ బెంచ్ మార్కు(ఐబీఎం)"గా నిర్ణయించారు. అంటే కనీసం 12% ఆదాయం లేదా నిర్ణీత అద్దె చెల్లించాల్సి ఉంటుంది.విశాఖపట్నం యాత్రి నివాస్, కళింగపట్నం హరితా బీచ్ రిసార్ట్‌లు ఉన్నాయి.ద్వారకా తిరుమల హరితా హోటల్, దిండి హరితా కోకోనట్ రిసార్టు ఉన్నాయి. సూర్యలంక హరితా హోటల్.. విజయవాడ హరితా హోటల్, బెర్మ్‌పార్క్.. విజయవాడ హరితా హోటల్ భవానీ ద్వీపం.. నాగార్జున సాగర్ హరితా హోటల్, విజయపురి సౌత్.. ఎత్తిపోతల ధ్యానబుద్ధ హరితా హోటల్ ఉన్నాయి.నెల్లూరు హరితా హోటల్.. శ్రీకాళహస్తి హరితా హోటల్ ,గండికోట హరితా హోటల్.. గండి హరితా హోటల్.. కడప హరితా హోటల్.. ఒంటిమిట్ట హరితా హోటల్కర్నూలు హరితా హోటల్, ఓర్వకల్లు హరితా హోటల్, మహానంది హరితా హోటల్.. అహోబిలం హరితా హోటల్.. లేపాక్షి హరితా హోటల్.. శ్రీశైలం హరితా హోటల్‌లు ఉన్నాయి. ఈ హోటల్స్‌లో మొత్తం 222 గదులు ఉన్నాయి.పర్యాటకులకు మంచి సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ హోటళ్లు, రిసార్టుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని నిర్ణయించారు. ఈ మేరకు త్వరలో బిడ్లను ఆహ్వానించనున్నారు.

హోటళ్లలో వసతులు సరిగా లేకపోవడం, మంచి చెఫ్‌లు లేకపోవడం వంటి కారణాల వల్ల ఆదరణ తగ్గింది.. అందుకే ఈ మార్పు చేస్తున్నారు. కేరళలో కూడా ఇదే విధానం అమల్లో ఉందని అధికారులు చెబుతున్నారు. అక్కడ పర్యాటకులకు మంచి సదుపాయాలు అందుతున్నాయని అంటున్నారు. దీనివల్ల పర్యాటకుల ఆదరణ పెరుగుతుందని భావిస్తున్నారు.గండికోటను సందర్శించిన సీఎం చంద్రబాబు.. అబ్బో ఇన్ని సమస్యలు ఉన్నాయా!రాష్ట్రంలో ఒఖుఆఅ హోటళ్ల ద్వారా ఏటా రూ.10 నుంచి రూ.15 కోట్ల ఆదాయం వస్తోంది. ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఈ ఆదాయం రూ.20 కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆ హోటళ్లలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగం పోకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. వారి ఉపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు. మరి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఏ మేరకు సక్సెస్ అవుతుందో చూడాలి మరి.



# సెట్‌లో కోచ్ సూచనలతోనే..

## సన్నిహిత సన్నివేశాల షూట్‌పై తమన్నా కామెంట్స్ వైరల్

తెలుగు సినిమా ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఉత్తరాది భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా బాటియా. రెండు దశాబ్దాల కెరీర్‌లో తను ఏ సినిమాకు సైన్ చేసినా నో కిస్ నిబంధన ఉండటం చాలా మందికి తెలియని విషయం తెలిసిందే. సుదీర్ఘ సినీ కెరీర్‌లో ఏ సినిమాలో కోసం లిప్ లాక్ సీన్లలో నటించలేదు. లస్ట్ స్టోరీస్ సినిమాతో ఆ రూల్‌ను పక్కన పెట్టేసింది. ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ బోల్డ్ సన్నివేశాల్లో కనిపిస్తూ హాట్ టాపిక్‌గా నిలుస్తోంది. అయితే సన్నిహిత సన్నివేశాల్లో నటించే విషయంపై తొలిసారి తన స్పందనను తెలియజేసింది మిల్కీ బ్యూటీ.ఓ నటిగా బలమైన కంటెంట్ ఉన్న సినిమాల్లో తప్పనిసరి అయిన బోల్డ్ సీన్లు, సన్నిహిత సన్నివేశాల్లో నటించే అంశంలో తనకు తాను పరిమితులు విధించుకున్నట్టు చెప్పింది తమన్నా. బోల్డ్ సన్నివేశాలు పూర్తిగా ఫేక్. ప్రతీ సన్నిహిత సన్నివేశాన్ని సెట్‌లో కోచ్ పర్యవేక్షణలో చిత్రీకరణ చేస్తారు. అలాంటి సీన్లలో నటించేటప్పుడు మేల్ కోస్టార్లకు కొన్ని ప్రాంతాల్లో టచ్ చేయొద్దని కోచ్ ప్రత్యేక సూచనలు ఇస్తారని చెప్పుకొచ్చింది.అంతేకాదు అలాంటి సన్నివేశాలు సెట్‌లో అందరూ ఉండగానే సరైన సూచనలతో చాలా జాగ్రత్తగా షూట్ చేస్తారు. ప్రతీ కదలికను డ్యాన్స్ స్టెప్పులను కొరియోగ్రఫీ చేసినట్టుగా షూట్ చేస్తారంటూ చెప్పుకొచ్చింది. తమన్నా చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతేడాది ఓదెల 2 సినిమాతో ప్రేక్షకులను పలుకరించిన ఈ భామ ప్రస్తుతం 4 హిందీ సినిమాలను లైన్‌లో పెట్టింది.

# లోభానికి, త్యాగానికి జరిగే పోరాటం



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్-ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా హీరో ప్రభాస్ ఈ చిత్ర టీజర్‌ను లాంచ్ చేశారు. 'లోభానికి, త్యాగానికి, చీకటికి, దైవత్వానికి మధ్య జరిగే పోరాటాన్ని అద్భుతంగా ఈ టీజర్‌లో ఆవిష్కరించారు. ఆకాశమంత ఆరాధన కలిగించేలా శివుని సాక్షాత్కారం టీజర్‌లో స్పిరిచువల్ హైపాయింట్. అలాగే విజువల్ వండర్‌గా ఉంది. సుధీర్ బాబు ప్రజెన్స్ డివైన్ వైబ్స్ కలిగిం చింది. త్యాగంతో పుట్టిన రక్షకుడిగా కనిపించిన పాత్రలో ఆయన లుక్ అదిరిపోయింది. సోనాక్షి కలకలం సృష్టించే శక్తిగా కనిపించింది. ఈ మైథాలజికల్ సూపర్ నేచురల్ థ్రిల్లర్ హై ఆక్టేన్ స్టోరీటెల్లింగ్, మైండ్‌బ్లోయింగ్ విజువల్స్ అదరగొట్టింది' అని చిత్రయూనిట్ తెలిపింది. జీ స్టూడియోస్, ప్రెర్ణా అరోరా ప్రెజెంట్ చేస్తున్న ఈ సినిమా ను ఉమేష్ కుమార్ బన్సాల్, ప్రెర్ణా అరోరా నిర్మిస్తున్నారు.



# ఆ ఒక్క వ్యాయామంతో ఈ స్టార్ హీరోయిన్ ఏకంగా 9 కేజీలు బరువు తగ్గిందా?

టాలీవుడ్ ప్రేక్షకులకు "నేను శైలజ" చిత్రం ద్వారా పరిచయమైన కీర్తి సురేష్, "మహానటి" సినిమా ద్వారా తన అద్భుత నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రం ఆమెకు నేషనల్ అవార్డును కూడా తెచ్చిపెట్టింది. మహానటి పాత్రకి మరింత జీవం పోసేందుకు, సావిత్రి జీవితంలో ఉన్న మార్పులను ప్రతిబింబించేందుకు కీర్తి నిజంగానే కొంత బరువు పెరగాల్సి వచ్చింది. ఈ విషయాన్ని తానే స్వయంగా వెల్లడిస్తూ, సినిమా పూర్తయ్యిన తర్వాత కూడా కొన్నాళ్లు బొద్దుగా ఉన్నానని తెలిపింది. "అప్పుడు షూటింగ్‌కి వెళ్లి, వచ్చి తినేసి నిద్రపోయేదానిని. ఆ అలవాటు కారణంగా కొద్దిగా లావయ్యాను'' అంటూ ఓపెన్‌గా చెప్పుకొచ్చింది. అయితే, ఈ జీవనశైలి ఆరోగ్యానికి మంచిది కాదని గుర్తించిన కీర్తి, తన ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టింది. కేవలం 9 నెలల్లోనే సుమారు 8 నుండి 9 కిలోల వరకు బరువు తగ్గిన ఆమె, దీని వెనుక ఉన్న రహస్యాన్ని కూడా చెప్పింది."రోజుకు కనీసం గంటసేపు కార్డియో చేస్తూ, సాధారణ డైట్ పాటించాను. అందులో ఎలాంటి క్రాష్ డైట్లు లేవు.. లైఫ్‌స్టైల్‌కి తగ్గట్టు ప్లాన్ చేసుకున్న డైట్ మాత్రమే," అని కీర్తి వెల్లడించింది.కార్డియో వ్యాయామం చేయడం వలన దాని ప్రభావం కాళ్లు, ఛాతి, బ్యాక్‌పై పడుతుంది. ఈ వ్యాయామం వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ చేయడం వంటివి. కార్డియో వ్యాయామం ద్వారా కీర్తి సురేష్ బాగానే తగ్గింది. ప్రస్తుతం తక్కువ బరువుతో ఫిట్‌గా కనిపిస్తున్న కీర్తి సురేష్, తాను పెట్టిన కృషి ఫలించి ఫ్యాన్స్‌ను మళ్లీ ఆకట్టుకుంటోంది. ఆమె డెడికేషన్ ఇప్పుడు పలువురికి ఇన్స్పిరేషన్‌గా మారుతోంది. కీర్తి సురేష్ తన కెరియర్‌లో నేను శైలజ చిత్రం తర్వాత నేను లోకల్, మిస్ ఇండియా, గుడ్ లక్ సఖి, సర్కారు వారి పాట, రంగ్ దే వంటి హిట్ చిత్రాల్లో నటించి ప్రశంసలు అందుకుంది.

హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది కీర్తి. ఇటీవలే ఉప్పు కప్పురంబు సినిమాతో హిట్టు అందుకుంది. .. గతేడాది వివాహ బంధంలోకి అడుగుపెట్టిన కీర్తి సురేష్.. పెళ్లి తర్వాత కూడా సినిమాలు చేస్తూ బిజీగా గడుపుతుంది. అయితే ఆమె ఓ చిత్రంలో వేశ్యగా కనిపించనుందంటూ ఇటీవల జోరుగా వార్తలు వచ్చాయి. దానిపై క్లారిటీ రాలేదు.

# కూలీ దెబ్బకు రికార్డులు ఖాళీ



ప్రేక్షకుల్లో కూలీ ఫీవర్ మాములుగా లేదు. సూపర్ స్టార్ రజనీకాంత్ కు దర్శకుడు లోకేష్ కనగరాజ్ తోడవ్వడంతో అంచనాలు అంతకంతా పెరుగుతూ పోతున్నాయి. ట్రైలర్ వచ్చాక కొంచెం మిక్స్డ్ టాక్ వచ్చినప్పటికీ దాని ప్రభావం ఒక్క శాతం లేకపోవడం ట్రేడ్ ని ఆశ్చర్యపరుస్తోంది. తెలుగు రాష్ట్రాల టికెట్ అమ్మకాలు మొదలుపెట్టకుండా కేరళ, తమిళనాడు నుంచే సుమారు నలభై కోట్ల దాకా వసూలు చేయడం కూలీ మేనియాకు నిదర్శనం. ఏపీ తెలంగాణ స్టార్ట్ అయ్యాక ఈ నెంబర్లు ఎక్కడికి చేరుకుంటాయో ఊహించడం కష్టం. బుక్ మై షో సర్వర్ క్రాష్ అయినా ఆశ్చర్యపోనక్కర్లేదు. సలార్ కు అలా జరిగింది. అవర్లీ ట్రెండ్స్ లోనూ కూలీ దూసుకుపోతోంది. సగటున గంటకు అయిదు వేల నుంచి యాభై వేల టికెట్ల మధ్యలో ఊచకోత కొనసాగుతూనే ఉంది. వార్ 2 కన్నా చాలా ముందుగా బుకింగ్స్ మొదలుపెట్టడం కూలీకి బాగా కలిసి వస్తోంది. ఇక్కడే కాదు ఓవర్సీస్ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మూడు మిలియన్లు దాటేసిన తలైవర్ మొదటి షో పడే టైంకి ఏ నెంబర్ దగ్గర ఆగుతాడో అంచనా వేయడం కష్టమనేలా ఉంది. విదేశాల్లో కూలి మేనియా మాటలకు అందడం లేదు. ప్రభుత్వ పోలీసులు సైతం ప్రమోషన్ క్యాంపైన్ లో పాలు పంచుకోవడం చూస్తే రజనీకాంత్ రీచ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎలాంటి విజువల్ ఎఫెక్ట్స్ లేని ఒక మాములు కమర్షియల్ యాక్షన్ మూవీకి ఇంత బజ్ రావడం వెనుక రజని ఇమేజ్ తో పాటు లోకేష్ సృష్టించుకున్న ఫాలోయింగ్ కారణంగా నిలిచింది.

ఫస్ట్ షో నుంచి జస్ట్ యావరేజ్ టాక్ వచ్చినా చాలు ఈ జంట చేయబోయే విధ్వంసం ఓ రేంజ్ లో ఉంటుంది.

# సత్యదేవ్ కష్టానికి ఫలితం ఎప్పటికో



టాలీవుడ్ టాలెంటెడ్ యంగ్ యాక్టర్స్‌లో సత్యదేవ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ప్రతిభ పుష్కలంగా ఉన్నా బ్రేక్ అందుకోవడంలో పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. చిరంజీవి గాడ్ ఫాదర్ లో విలన్ గా నటించేందుకు వెనుకాడలేదు. కింగ్డమ్ లో చనిపోయే హీరో అన్నయ్యగా ఎస్ చెప్పాడు. కానీ ఫలితాలు దక్కడం లేదు. నటన పరంగా ప్రశంసలు దక్కుతున్నాయి కానీ అవి కమర్షియల్ గా సక్సెస్ కాకపోవడం ఇబ్బంది పెడుతోంది. ఈ కారణంగానే సత్యదేవ్ తో సినిమాలు కొన్ని చివరి దశ దాకా వచ్చి ఓటిటి డీల్స్, థియేటర్ బిజినెస్ కోసం ఆలస్యమవుతున్న దాఖలాలున్నాయి. తాజాగా అరేబియా కడలి అనే వెబ్ సిరీస్ తో సత్యదేవ్ ప్రేక్షకుల ముందుకొచ్చాడు. తండేల్ కథే ఇది. కాకపోతే కాపీ రైట్స్ విషయంలో రేగిన గందరగోళం వల్ల ఒకే కథ రెండుసార్లు తెరకెక్కింది. ఒకవేళ తండేల్ ఫ్లాప్ అయ్యుంటే ఇప్పుడు సత్యదేవ్ కి అడ్వాంటేజ్ అయ్యేది. కానీ అది సూపర్ హిట్ కావడంతో పాటు వంద కోట్ల గ్రాస్ వసూలు చేసింది. టీవీలో మంచి టిఆర్పి వచ్చింది. అందరూ చూసేసిన స్టోరీ మళ్ళీ వెబ్ సిరీస్ గా రావడంతో ఆడియన్స్ లో అంతగా ఆసక్తి కనిపించలేదు. పైగా తండేల్ కథనే విడమరిచి డిటైల్డ్ గా చెప్పారు తప్పించి దానికన్నా బావుందని చెప్పే అవకాశం అరేబియా కడలి టీమ్ ఇవ్వలేదు. ఇండస్ట్రీలో సక్సెస్ ఎంత ముఖ్యమో చెప్పేందుకు సత్యదేవ్ ఉదాహరణ చాలు. కొన్నిసార్లు అదృష్టం కలిసి రావాలి. ఒకవేళ ఇదే ఉండి ఉంటే అరేబియా కడలి ముందు రిలీజై మంచి పేరు తెచ్చేదేమో. ఆర్టిస్టుగా సత్యదేవ్ బిజీగానే ఉన్నాడు. ఒకప్పటి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ఇప్పుడు హీరోగా మారిపోయాడు కానీ హిట్లు వరసగా పడితే కెరీర్ ఊపందుకుంటుంది.

# టైమింగ్ మిస్సయిన అతడు



నిన్న సాయంత్రం స్పెషల్ ప్రీమియర్లతో అతడు రీ రిలీజైపోయింది. ఓపెనింగ్స్ పరంగా ఖలేజా రికార్డులను బద్దలు కొడుతుందని ఆశించిన అభిమానులకు ఈసారి టైమింగ్ మిస్సయినట్టు కనిపిస్తోంది. ముందస్తు అంచనాల ప్రకారం ఇవాళ్టితో కలుపుకుని సుమారు అయిదు కోట్ల దాకా గ్రాస్ రావొచ్చని ఒక అంచనా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో చాలా చోట్ల ఆశించిన స్థాయిలో పెద్ద ఎత్తున బుకింగ్స్ లేవని ట్రేడ్ టాక్. అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో రెండున్నర కోట్ల దాకా వసూలయ్యాయట. ఏపీ తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పరీక్ష పెడుతున్నాయి.

జనం బయటికి రావడానికి జంకుతున్నారు. మూడో వారంలోనూ మహావతార్ నరసింహ ర్యాంపేజ్ బాక్సాఫీస్ వద్ద కొనసాగుతోంది. వీకెండ్ మొత్తం ఎక్కడా టికెట్లు దొరకని పరిస్థితి నెలకొనడంతో డిస్ట్రిబ్యూటర్లు షోలు పెంచుతున్నారు. వీటికి తోడు కింగ్డమ్ రెండో వారం థియేటర్ అగ్రిమెంట్లు కొనసాగుతుండగా వార్ 2, కూలీ కోసం ఎదురు చూస్తున్న మూవీ లవర్స్ వాటికి కావాల్సిన సొమ్ముల కోసం ఇప్పుడు సినిమాలకు వెళ్లడం తగ్గించుకున్నారు. ఇది కూడా అతడు మీద ఎఫెక్ట్ చూపిస్తోంది. మహేష్ బాబు పుట్టినరోజు స్పెషల్ గా ఎప్పటికి మర్చిపోలేని మైలురాళ్ళు ఇవ్వాలని ప్లాన్ చేసుకున్న ఫ్యాన్స్ కి పైన చెప్పినవి అడ్డంకిగా మారుతున్నాయి. సుదర్శన్ 35 ఎంఎంలో రెండు రోజులకు నాలుగు షోలు వేయించుకోవడానికే నానా తంటాలు పడిన వైనం కనిపించింది. అతడుకి చేతిలో ఉన్నవి అయిదు రోజులు మాత్రమే. నిజానికి అతడు చాలా స్పెషల్ గా సెలెబ్రేట్ చేయాల్సిన మూవీ.

# వార్ 2 ప్రీమియర్ షోలు ఉంటాయా



ఏపీ తెలంగాణలో వార్ 2 స్పెషల్ షోలు తెల్లవారుఝాము నాలుగు గంటల నుంచి వేసేందుకు డిస్ట్రిబ్యూటర్ నాగవంశీ ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. సాధారణంగా హిందీలో అంత ఉదయాన్నే ప్రీమియర్లు వేయరు. ముందు రోజు రాత్రి లేదా మహా అయితే మార్నింగ్ ఆరు తర్వాత ఉంటాయి తప్ప వేరే టైమింగ్స్ పెట్టుకోరు. కానీ తెలుగులో అలా కాదు. దేవర, పుష్ప 2కి మిడ్ నైట్ షోలు పడ్డాయి. బ్రహ్మాండంగా వర్కవుట్ చేసుకున్నాయి. ఇదే స్ట్రాటజీ గేమ్ ఛేంజర్, హరిహర వీరమల్లుకు పని చేయలేదు. సరే ఏదైనా కంటెంట్ మీద ఆధారపడి ఉంటుంది కనక ఫలితం వచ్చే దాకా ఎదురు చూడాలి. ఇదిలా ఉండగా వార్ 2 ప్రీమియర్లు వేయడం సేఫా కాదా అనే దాని మీద పంపిణి వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎంత జూనియర్ ఎన్టీఆర్ ఉన్నా ఇది హిందీ మూవీ. మనకు డబ్బింగ్ వెర్షనే వస్తుంది. సో బాలీవుడ్ ఫ్లేవర్ తో నిండి ఉంటుంది. నిద్ర పోకుండా అంత చీకటి ఉండగానే ఫ్యాన్స్ వస్తున్న షోల మీద విపరీతమైన అంచనాలు నెలకొంటున్నాయి. యావరేజ్ ఉన్నా చాలు అసంతృప్తితో ఫ్లాప్ అని రుద్దేస్తున్నారు. గుంటూరు కారం లాంటి సినిమాలకు దీని వల్ల జరిగిన డ్యామేజ్ చాలా ఎక్కువ. అందుకే వార్ 2 విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సి ఉంటుంది. పర్మిషన్లైతే అడిగారని వినికిడి. ఇది కాకుండా యష్ రాజ్ ఫిలిమ్స్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావాలి. ఎందుకంటే ఉత్తరాది కంటే రెండు మూడు గంటల ముందే దక్షిణాదిలో షోలు వేయడం వల్ల వచ్చే ఫలితాల గురించి ఒక విశ్లేషణ చేసుకోవాలి. అసలే కూలీతో పోటీ ఉంది. వార్ 2 ని ఎంత లేదనుకున్నా తమిళ అభిమానులు టార్గెట్ చేసుకుని తీరతారు. పరస్పరం నెగటివ్ ప్రాపగండాలు చేసుకోవడానికి కొందరు సిద్ధంగా ఉంటారు. ఇవన్నీ వార్ 2 కాచుకోవాల్సి ఉంటుంది. నేటివిటీ ఫ్యాక్టర్ ఒక్కటే సమస్యగా మారనున్న వార్ 2కి అండగా నిలబడుతోంది జూనియర్ ఎన్టీఆర్ అభిమానులే. దేవరలాగా దీన్ని కూడా కాచుకుంటే బ్లాక్ బస్టర్ ఖాతాలో పడినట్టే.

# భిన్న కాన్సెప్ట్‌తో 'చాయ్ వాలా'



శివ కందుకూరి హీరోగా 'చాయ్ వాలా' అనే చిత్రాన్ని హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్ మీద రాధా విజయలక్ష్మి, వెంకట్ ఆర్.పాపుడిప్పు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రమోద్ హర్ష రచన, దర్శకత్వం వహిస్తున్నారు.శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో శివ కందుకూరి, రాజీవ్ కనకాల స్కూటీపై జాలీగా తిరుగుతూ కనిపిస్తున్నారు. 'ఈ కథ ప్రేమ, వారసత్వం అనే అంశాల చుట్టూ తిరుగుతుంది. ఓ పర్ఫెక్ట్ చాయ్, కప్పులా ఉంటుంది. భావోద్వేగాలు, సంప్రదాయం, కలలతో నిండిన అద్భుతమైన ప్రయాణాన్ని చూసేందుకు సిద్ధంగా ఉండండి. టీజర్ అతి త్వరలో వస్తుంది' అంటూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ మూవీకి ప్రశాంత్ ఆర్.విహారి సంగీతం సమకూరుస్తుండగా, క్రాంతి వర్ల సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. పవన్ నర్వా ఈ చిత్రానికి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'శివ కందుకూరి ఎప్పటికప్పుడు వైవిధ్యమైన కథలను ఎంచుకుని తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు. ఆయన నటిస్తున్న మరో భిన్న కాన్సెప్ట్ చిత్రమిది. ఈ సినిమా తప్పకుండా విశేష ప్రేక్షకాదరణ పొందుతుందనే నమ్మకం ఉంది' అని మేకర్స్ తెలిపారు.

## బంధాలు గుర్తుండేలా జరుపుకునే రాఖీ పండుగ: సంతోష్ రాజ్





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)బంధాలు గుర్తుండేలా ఒకరికొకరు కష్టసుఖాల్లో తోడునీడగా ఉండాలని అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుకొని జరుపుకుంటున్నామని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సంతోష్ రాజ్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంధాలను ఎప్పుడు మరువద్దని డబ్బు హొదా వచ్చాక బంధాలను మరిచేవారు ఎంతోమంది సమాజంలో ఉన్నారని అలాంటివారు బంధాలకు విలువలు ఇవ్వాలని అన్నా చెల్లెల అనుబంధానికి ఏ హొదా అడ్డు రాదని ఏ స్థాయిలో ఉన్నా మనము బంధాలను మరువద్దని ఈ సందర్భంగా సంతోష్ రాజ్ అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో చెల్లెలు రాజ్యలక్ష్మి తో సాంప్రదాయ బద్ధంగా రాఖీని కట్టించుకున్నారు. ఈ కార్యక్రమంలో బావ భాస్కరిని నరేందర్ రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






కూకట్ పల్లి(ప్రశ్న న్యూస్) యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కూకట్ పల్లి లో ఘనంగా జరిగాయి. శనివారం యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కలికోట శంకర్ ఆధ్వర్యంలో బాలాజీ నగర్ డివిజన్ శ్రీహరి నగర్ కాలనీలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాటాడుతూకాంగ్రెస్ యువజన విభాగమైన యువజన కాంగ్రెస్ ఇటీవల ఎన్నికల్లో కీలకంగా పనిచేసింది. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం యూత్ కాంగ్రెస్ నాయకులు ఎంతో శ్రమిస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో యువజన కాంగ్రెస్ కీలకంగా పనిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరిఫ్, డివిజన్ అధ్యక్షుడు సుల్తాన్, జనరల్ సెక్రటరీ శ్రవణ్, అఫ్సర్, పవన్, చిన్నా, విక్రమ్, అంజి తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై సందేశం ఇచ్చారు.

## మాతమ్మ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక




శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) తిరుపతి జిల్లా,శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం చిట్టతూరు గ్రామం అరుంధతివాడ, మాతమ్మ గుడి కూడలి నందు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు, శ్రీకాళహస్తి నియోజవర్గ ఇన్చార్జ్ ఇర్ల.రాజా మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఎమ్మార్పీఎస్ నాయకులకు,కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు,కార్యకర్తలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎంఆర్పిఎస్ యువసేన అధ్యక్షులు మన్నేపల్లి ఈశ్వర్ మాదిగ, శ్రీకాళహస్తి ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు వెంకట ముని మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కృష్ణయ్య మాదిగ, మహేష్ మాదిగ, బాలరాజు మాదిగ,మోహన్ మాదిగ, మరియు చిట్టత్తూరు గ్రామం ఎంఆర్పిఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల గస్తీ పెంచండి తలపా దామోదరం రెడ్డి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మరియు మహిళా కళాశాల విద్యార్థుల భద్రత కొరకు ఆ దారి నందు పోలీస్ గస్తీ నీ ఏర్పాటు చేసి ఆకతాయిల ఆగడాలను కట్టడి చేయాలని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి కి వినతి పత్రం అందజేసిన శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి.తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి మహిళ జూనియర్ కళాశాల వరకు ప్రతిరోజు ఉదయం మరియు సాయంత్రం కళాశాలకు వెళ్లే విద్యార్థులు మరియు హాస్పిటల్ కు వైద్యం కొరకు నిరంతరం వందలాదిగ వచ్చే ప్రజల భద్రత దృష్ట్యా అదే విధంగా ఆకతాయల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ఆ మార్గం గుండా పోలీసుల గస్తీ అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్, శ్రీకాళహస్తి మండలం యువజన అధ్యక్షులు నవీన్, పురుషోత్తం, నాగరాజు, అరుణ్, సంతోష్, జోసెఫ్, చరణ్, సారధి, ఆసిఫ్, తేజ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలు మల్లారెడ్డి,మర్రి రాజశేఖరరెడ్డిలకు రాఖీ కట్టిన రుక్సానా యూనిస్ పాషా

**పాల్గొన్న మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సద్ది రమాదేవి**





మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ మండల మాజీ కోఆప్షన్ సభ్యురాలు షేక్ రుక్సానా యూనిస్ పాషా శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖరరెడ్డిలను వారి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి రాఖీలు కట్టారు. వీరితో పాటుగా మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సద్ది రమాదేవి, నూతనకల్ మాజీ వార్డు సభ్యురాలు చిన్నోళ్ల సుజాతభాస్కర్ లు ఎమ్మెల్యేలకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డబిల్ పూర్ పీఏసీఎస్ చైర్మన్ సద్ది సురేష్ రెడ్డి, మాజీ వార్డ్ సభ్యులు యూనిస్ పాషా, నూతనకల్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు చిన్నోళ్ల భాస్కర్ లతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల రక్షణకు బీఆర్టీయు నిరంతరం కృషి : పి.నారాయణ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) కార్మికుల హక్కుల రక్షణకు బీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర కనీస వేతనాల బోర్డు మాజీ చైర్మన్ పి.నారాయణ అన్నారు. శనివారం జిల్లాలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ బీఆర్టీయు అనుబంధ యూనియన్ జనరల్ బాడీ సమావేశం యూనియన్ ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి పి.నారాయణ, బీఆర్టీయు రాష్ట్ర నాయకులు వేముల మారయ్య, హమాలీ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్బంగా ఇతర సంఘాల నుండి పెద్ద ఎత్తున బీఆర్టీయు చేరినట్టు తెలిపారు. యూనియన్ అధ్యక్షులు, బీఆర్టీయు రాష్ట్ర నాయకులు పి.నారాయణ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ లో పని చేసే కార్మికుల సమస్యల పరిస్కారానికి బీఆర్టీయు నిరంతరం కృషి చేస్తుదన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు నిరంతరం రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. బీఆర్టీయుపై నమ్మకంతో యూనియన్ లో చేరిన వారి ఆశలు వమ్ము చేయకుండా పని చేస్తామన్నారు. ఈ సందర్బంగా యూనియన్ సలహాదారులుగా సంబు ప్రభాకర్, ఓర్సు రాములును, వర్కింగ్ ప్రెసిడెంట్ గా నాగాయపల్లి శ్రీనివాసులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యవర్గ సభ్యులుగా నర్సిహరెడ్డి, మల్లికార్జున్, ప్రభాకర్, ప్రవీణ్ రెడ్డి, మల్లేష్, కృష్ణ, వెంకటయ్య, రాంరెడ్డి, దశరథరాజు, రాజు, సురేష్, హరినాథ్, ఇమ్రాన్, రాజుకుమార్ తదితరులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

## మేడ్చల్ లో ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ మండలంలో యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా మేడ్చల్ పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ పురపాలక సంఘ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లవంగు రాకేష్ యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా ఎల్లంపేట పురపాలక సంఘం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జనగాం నాగరాజు గౌడ్ ఎల్లంపేటలో యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ అభివృద్ధికి నిరంతరం కృషి చేసినట్టుగా తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివశంకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదండపురం సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్, నాయకులు సంతోష్ గౌడ్, మధు, చింటూ, నవీన్, సామెల్, నాగరాజు, శ్రీధర్, గుండ్లమల్లేష్, నవీన్, అభిలాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కళను ప్రోత్సహించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**

**- మార్కండేయ స్వామి శోభాయాత్రలో రాష్ట్ర ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**



సిరిసిల్ల/వేములవాడ (ప్రశ్న న్యూస్) నూలు పౌర్ణమి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో భక్తిశ్రద్ధల మధ్య మార్కండేయ స్వామి శోభాయాత్ర ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ



విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై శోభాయాత్రను ప్రారంభించారు. అనంతరం మార్కండేయ దేవాలయం నుండి నేతన్న విగ్రహం వరకు భక్తులతో పాటు పాదయాత్రతో ఊరేగింపులో పాల్గొన్నారు. నేతన్నకు నేసిన వస్త్రం, పూలమాల సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విప్ ఆది మాట్లాడుతూ, "మార్కండేయ స్వామి కృపతో సిరిసిల్లలో ప్రతి కుటుంబం ఆనందం, ఐశ్వర్యంతో నిండాలి. నేతన్న కళను,వారి కష్టాన్ని గుర్తించి మరింత ప్రోత్సహించేందుకు ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు.

## మంథనిలో ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.**

**బండ.కిశోర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి**

**చీమల.సందీప్ నియోజక వర్గ అధ్యక్షులు**





**మంథని ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** మంథని నియోజకవర్గ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ దగ్గర్లో గల జెండాను ఎగరవేసి అనంతరం కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు,బ్రెడ్ పంపిణీ మరియు స్థానిక బస్టాండ్ లో యువజన కాంగ్రెస్ నాయకులు మహిళలతో రాఖీలు కట్టించుకొని వారికి శుభాకాంక్షలు తెలియజేసి డిపో మేనేజర్ తో మాట్లాడి మహిళల ప్రయాణ సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది మేనేజర్ గారు సానుకూలంగా స్పందించి బస్సులు అదనంగా ఏర్పాటు చేయడం జరిగింది యువజన కాంగ్రెస్ 1960లో స్థాపించబడిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య యువజన విభాగం, యూత్ కాంగ్రెస్ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగినటువంటి విభాగం యూత్ కాంగ్రెస్ అని తెలిపారు. యూత్ కాంగ్రెస్ ద్వారా రాజకీయ ఓనమాలు నేర్చి అనేకమంది దేశవ్యాప్తంగా ప్రముఖంగా రాజకీయాల్లో ఉన్నారని తెలిపారు యువత రాజకీయంగా ఎదగడానికి యువజన కాంగ్రెస్ మంచి ప్లాట్ ఫామ్ అని ఈ సందర్భంగా తెలిపారు గత 10 సంవత్సరాలు యువజన కాంగ్రెస్ ప్రతి గ్రామాల తిరుగుతూ గ్రామ గ్రామాన యువజన కాంగ్రెస్ కమిటీలు వేసి అనేక ధర్నాలు, దీక్షలు చేసి కాంగ్రెస్ పార్టీ అధికారం రావడానికి యువజన కాంగ్రెస్ ఎంతో కృషి చేసిందని తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అందిస్తుందో వాటిని అర్హులైన నిరుపేదలకు అందించే విధంగా ప్రజలకు నాయకులు శ్రీధర్ బాబు కి మధ్య యువజన కాంగ్రెస్ వారధిల పని చేస్తుందని తెలిపారు యువజన కాంగ్రెస్ నాయకులు ప్రియతమ నేత రాష్ట్ర మంత్రి అభివృద్ధి ప్రదాత శ్రీధర్ బాబు ఏదైతే ఈ నియోజవర్గాన్నే కాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో ముందుకు తీసుకుపోతు ఉన్నారు. ప్రాంతంలో విద్య వైద్యం మౌలిక సదుపాయాలు తాగునీరు సాగునీరు అందిస్తూ అన్ని రంగాలలో మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకు వెళుతున్నారని, నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా వారు పరిష్కరిస్తూ ప్రజల బాగోగులు చూసుకుంటున్నారని వారు తెలిపారు. శ్రీధర్ బాబు, శ్రీనుబాబు నాయకత్వంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ నాయకులు శక్తి వంచన లేకుండా పని చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల్ అధ్యక్షులు శ్రీకాంత్ పట్టణ అధ్యక్షుడు పెంటరీ.రాజు, పెరుగు.తేజ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, అనుబంధ సంఘాల నాయకులు, అన్ని విభాగాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# బంధానికి బీటలు

## - రక్తసంబంధాన్ని రాజకీయమే డామినేట్ చేస్తుందిగా..?





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాజకీయాలు వేరు, వ్యక్తిగత సంబంధాలు లేవు. బయట రాజకీయంగా తీవ్ర విమర్శలు చేసుకుని ఎదుట పడితే కొట్టుకుంటారేమో అన్నట్లుగా మీడియా ఎదుట ప్రవర్తించే నేతలు ఎప్పుడైనా ఎదురుపడితే తమ కంటే ఆత్మీయులు, ప్రాణ స్నేహితులు ఎవరూ లేరన్నట్లుగా వ్యవహరిస్తూంటారు. అలాగే కుటుంబసభ్యులు వేర్వేరు పార్టీల్లో ఉన్నా తమ వ్యక్తిగత సంబంధాలను మాత్రం వదులుకోరు. కుటుంబాన్ని ఐక్యంగానే ఉంచుకుంటారు. శనివారమే నందమూరి బాలకృష్ణ, పురందేశ్వరి రక్షా బంధన్ జరుపుతున్నారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. బాలకృష్ణ టీడీపీలో ఎమ్మెల్యేగా ఉంటే, పురందేశ్వరి బీజేపీలో ఎంపీగా ఉన్నారు. అయితే కొంత మంది రాజకీయ నేతలు మాత్రం ఈ గీతను చెరిపేసుకున్నారు. వ్యక్తిగత జీవితంలో రాజకీయాలను కలిపేసుకుని తమకు వ్యతిరేకిస్తున్న కుటుంబసభ్యులను దూరం చేసుకున్నారు.

### - కేటీఆర్, కవిత మధ్య పెరిగిన దూరం

తెలంగాణలో మరో కీలకమైన పార్టీ అయిన బీఆర్ఎస్ వారసులు అయిన కేటీఆర్, కవిత మధ్య కూడా ఇటీవలి కాలంలో పొసగడం లేదు. వ్యక్తిగత సంబంధాలు బాగుండాలి. కానీ రాజకీయంగా కవిత తీసుకున్న నిర్ణయంతో కేటీఆర్ కవిత విషయంలో అంత సానుకూలంగా లేరు. ఇటీవల కేటీఆర్ పుట్టిన రోజు నాడు కవిత సోషల్ మీడియాలో హ్యాపీ బర్త్ డే కేటీఆర్ అన్నా అని ఆప్యాయంగా ట్వీట్ పెట్టారు. కానీ కేటీఆర్ నుంచి రిప్లయ్ లేదు. కానీ కవిత కుటుంబ పరంగా మాట్లాడాల్సి వచ్చినప్పుడు ఎప్పుడూ వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. కానీ రాజకీయంగా మాత్రం వ్యతిరేకిస్తున్నారు. అందుకే కేటీఆర్ దూరం పెట్టారు. రాఖీ పండుగ రోజు కవిత వచ్చి రాఖీ కడతారేమో అన్న ఉద్దేశంతో హైదరాబాద్ నుంచి వెళ్లిపోయారని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. ఇక్కడ కూడా వ్యక్తిగత , కుటుంబ అంశాలకు రాజకీయాన్ని కలుపుకోవడంతో గ్యాప్ వచ్చేసింది.

### - జగన్, షర్మిల మధ్య తెగిపోయిన కుటుంబ బంధాలు

వైఎస్ జగన్ జైలులో ఉన్నప్పుడు వైఎస్ షర్మిల రెండు తెలుగురాష్ట్రాల్లో మూడు వేల కిలోమీటర్ల వరకూ పాదయాత్ర చేశారు. అయితే ఆమెకు పార్టీలో ఎలాంటి పదవి ఇవ్వలేదు. అలాగే ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవి ఇవ్వలేదు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వలేదు. ఈ విషయంపై షర్మిల కుటుంబంలో ఎప్పుడైనా ప్రశ్నించారో లేదో తెలియదు కానీ తెలంగాణలో పార్టీ పెట్టుకున్నారు. జగన్ అన్నకు ఇబ్బంది లేకుండా తెలంగాణ లో పార్టీ పెట్టుకున్నారు. అయితే జగన్ తో ఆస్తుల వివాదం రావడంతో ఏపీలో రాజకీయాలు ప్రారంభించారు. తనపైనే రాజకీయాలు చేస్తుందా అన్న కోపంతో జగన్ ఆమెతో మాట్లాడటం మానేశారు. ఎంతగా అంటే చివరికి షర్మిల కుమారుడు.. అంటే మేనల్లుడు పెళ్లికి కూడా జగన్ వెళ్లలేదు. ఎప్పుడైనా ఇంటికి పిలిచి కొత్తబట్టలు పెట్టడం సంప్రదాయాలను కూడా పాటించలేదు.

ఇద్దరి మధ్య ముఖాలు కూడా చూసుకోనంత దూరం పెరిగింది. గతంలో రాఖీ పండుగ వద్ద అన్నా, చెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని వైసీపీకి చెందిన నేతలు, మీడియా హైలెట్ చేసేది. ఇప్పుడు షర్మిల ప్రస్తావన కూడా రావడం లేదు. రాజకీయం పూర్తిగా వ్యక్తిగతంగా తీసుకోవడం వల్ల వారి మధ్య దూరం పెరిగింది.

### - కుటుంబాలు కలిసి ఉంటేనే బలం

ప్రాంతీయ పార్టీల్లో కుటుంబాల ఆధిపత్యం ఉంటుంది. ఆ కుటుంబాల్లో విబేధాలు వస్తే పార్టీలపైనే ప్రభావం పడుతుంది. ఇప్పుడు బీఆర్ఎస్, వైసీపీల మధ్య అదే సారూప్యత కనిపిస్తోంది. ఆ పార్టీలో ఇద్దరు కీలక నేతలు చెల్లెళ్లను దూరం పెట్టడం వల్ల గందరగోళం పరిస్థితులు ఏర్పడ్డాయి. వైసీపీ అధినేతకు పోటీగా షర్మిల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలి బాధ్యతలు తీసుకున్నారు. కవిత కూడా రేపోమాపో సొంత పార్టీ పెట్టుకోబోతున్నారు. అప్పుడు మరింతగా వారి మధ్య దూరం పెరిగే అవకాశం ఉంది.

# వైసీపీ అధినేత సంచలన నిర్ణయం తీసుకుంటూరా..?

## - నేడో రేపో ప్రకటన ఉండనుందా?

**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంచలన నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈరోజు రేపట్లో పార్టీ తన నిర్ణయాన్ని వెల్లడించే అవకాశముందని తెలిసింది. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక ఈ నెల 12వ తేదీన జరగనుంది. నేటితో ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికను ఇటు టీడీపీ, అటు వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. కడప జిల్లాలో రెండు చోట్ల ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఒకటి పులివెందుల కాగా, మరొకటి ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నిక. పులివెందుల నియోజకవర్గం జగన్ సొంత నియోజకవర్గం కావడంతో అక్కడ పాగా వేయాలని టీడీపీ తీవ్రంగా ప్రయత్నిస్తుంది. అలాగే తమ స్థానాన్ని నిలబెట్టుకోవాలని వైసీపీ కూడా అంతే స్థాయిలో శ్రమిస్తుంది.

### - పోటా పోటీగా..

రెండు పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో ఉన్నారు. పులివెందుల నుంచి వైసీపీ అభ్యర్థిగా దివంగత మహేశ్వర్ రెడ్డి కుమారుడు బరిలో ఉండగా, టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి పోటీలో ఉన్నారు. ప్రచారం ఇరు పార్టీలో జోరుగా కొనసాగిస్తున్నాయి. టీడీపీ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారంలో పాల్గొంటున్నారు. వైసీపీ నుంచి అవినాష్ రెడ్డి, సతీష్ రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు కూడా తమకు శక్తికి మించి గెలుపొందేందుకు పోరాడుతున్నారు. అయితే అధికార బలం ఉపయోగించి టీడీపీ తమపై అక్రమ కేసులు పెడుతుందని, తమ నాయకులను కొట్టి తమపైనే కేసులు పెడుతుందని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

### - అధికార యంత్రాంగం సహకరించకపోవడంతో..

కానీ అదే సమయంలో ఎన్నిక సజావుగా జరిగేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అన్ని చర్యలు తీసుకుంటుందని, అందులో ప్రభుత్వ జోక్యం ఉండదని టీడీపీ నేతలు అంటున్నారు. అయితే అనేక గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంపై వైసీపీ అభ్యంతరం తెలుపుతుంది. మొత్తం 10 వేలకు పైగా ఉన్న ఓటర్లలో దాదాపు చాలా ఓటర్లు నాలుగు కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడాన్ని తప్పుపడుతుంది. ఎన్నికల కమిషన్ ను కూడా కలిసింది. కేవలం రిగ్గింగ్ చేసుకోవడానికే ఇటువంటి చర్యలకు అధికార పార్టీ పాల్పడుతుందని వైసీపీ ఆరోపిస్తుంది. ఎన్నికల కమిషన్ ను కలిసినా అదే గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరినా స్పందిచడం లేదని వైసీపీ నేతలు అంటున్నారు.


### - ఈ నెల 12వ తేదీన ఎన్నిక..

ఈ నేపథ్యంలో పులివెందుల ఉప ఎన్నిక బరి నుంచి వైసీపీ తప్పుకుంటుందన్న ప్రచారం జరుగుతుంది. ఎన్నికలు జరగడానికి అంటే ఈ నెల 12వ తేదీన పోలింగ్ కావడంతో ముందుగానే ఎన్నికను బాయ్ కాట్ చేయాలన్న నిర్ణయానికి వైసీపీ నేతలు వచ్చినట్లు వైసీపీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఎందుకంటే సహజంగా అధికార పార్టీ అన్ని రకాలుగా తమపై ఆధిపత్యం ప్రదర్శించే అవకాశముంటుందని, పోలీసులు, ఎన్నికల అధికారులు అధికార పార్టీకే సహకరించే అవకాశాలున్న పరిస్థితుల్లో తాము ఎన్నిక నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పేందుకు వైసీపీ నేతలు సిద్ధమవుతున్నారు. అప్పుడు ఎన్నిక జరిగినా తాము పోటీ చేయలేదని చెప్పుకోవడానికి అవకాశం దక్కుతుందన్నది వారి ఆలోచన. జగన్ పరువు కూడా నిలబడుతుందని బాయ్ కాట్ ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.



# హైదరాబాద్‌లో మళ్లీ వాన

## - రంగారెడ్డి జిల్లా తొర్రూరులో అత్యధికంగా 116.5 మి.మీ. వర్షపాతం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భాగ్యనగరాన్ని శనివారం రాత్రి కూడా భారీ వర్షం ముంచెత్తింది. ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన కారణంగా నగరం అస్తవ్యస్తమైంది. ముఖ్యంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. పెద్ద అంబర్‌పేట్ నుంచి ఎల్బీనగర్ మీదుగా నగరంలోకి వచ్చే మార్గాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. శనివారం సాయంత్రం నుంచి నగరంలోని పలు ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది

. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం, నాగోల్, ఉప్పల్, ఎల్బీనగర్, బీఎన్ రెడ్డి నగర్ వంటి శివారు ప్రాంతాల్లో అతి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాదర్‌గుల్‌లో 80 మి.మీ., హయత్‌నగర్‌లో 75 మి.మీ. చొప్పున వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. ఈ భారీ వర్షానికి సైదాబాద్‌లోని రెడ్డి కాలనీ పూర్తిగా నీట మునిగింది. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో స్థానికులు బయటకు రాలేక తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భాగ్యలత వద్ద కూడా రోడ్డుపై నీరు నిలవడంతో వాహనాలు నత్తనడకన కదిలాయి. నగరంలోని సికింద్రాబాద్, తార్నాక, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, మియాపూర్, గచ్చిబౌలి, మెహిదీపట్నం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కోఠి, అబిడ్స్ సహా దాదాపు అన్ని ప్రధాన ప్రాంతాల్లో వర్షం ప్రభావం చూపింది. రోడ్లన్నీ చెరువులను తలపించడంతో అనేక చోట్ల జనజీవనం స్తంభించింది. సమాచారం అందుకున్న అధికారులు, సహాయక చర్యలు చేపట్టి, వరద నీటిని తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు.

# కేసీఆర్ ఇంట్లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

## రాఖీలు కట్టిన తోబుట్టువులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంట్లో రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. రాఖీ పూర్ణిమ సందర్భంగా కేసీఆర్‌కు ఆయన అక్కలు లక్ష్మీబాయి, జయమ్మ, చెల్లెలు వినోదమ్మ రాఖీ కట్టారు. కేసీఆర్ ఆరోగ్యంగా, దీర్ఘాయుష్మంతుడై ఉండాలని వారు ఆకాంక్షించారు. తమ సోదరుడికి మిఠాయిలు తినిపించారు. ఈ వేడుకల్లో కేసీఆర్ అర్ధాంగి శోభమ్మ తదితరులు కూడా పాల్గొన్నారు. రాఖీ కట్టిన అనంతరం కేసీఆర్ తన అక్క లక్ష్మీబాయి కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్నారు. తన సోదరీమణులకు ఎప్పుడూ అండగా ఉంటానని కేసీఆర్ మాట ఇచ్చారు.

# సేవింగ్స్ అకౌంట్లో ? 50 వేలు ఉండాలి

## కొత్త కస్టమర్లకు ఐసీఐసీఐ షాక్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** ఐసీఐసీఐ బ్యాంక్ కస్టమర్లకు భారీ షాక్ ఇచ్చింది. సేవింగ్స్ అకౌంట్స్ లో మినిమమ్ బ్యాలన్స్ కనీసం రూ.50వేలు ఉండాలని బాంబు పేల్చింది. దాంతో కస్టమర్లు పరేషాన్ అవుతున్నారు. ఈమధ్య కాలంలో మినిమమ్ బ్యాలెన్స్ లేకపోతే ఫైన్ వేసే పద్దతిని చాలా ప్రభుత్వ రంగం బ్యాంకులు ఎత్తేశాయి. కానీ ప్రైవేటు రంగ బ్యాంక్ ఐసీఐసీఐ మాత్రం ఓవరాక్షన్ చేస్తోంది. సేవింగ్ అకౌంట్లలో మినిమమ్ బ్యాలెన్స్ ను అమాంతం పెంచేసింది. మెట్రో, అర్బన్, సెమీ అర్బర్, గ్రామీణ బ్రాంచ్ అకౌంట్ హోల్డర్స్ అందరిపైనా పెంపు ప్రభావం పడుతోంది. ఈ రూల్ 2025 ఆగస్టు 1 తర్వాత సేవింగ్స్ అకౌంట్ తెరిచే కస్టమర్లకు వర్తిస్తుంది. ఇప్పటికే ఉన్న ఖాతాదారులకు వర్తించదని ఐసీఐసీఐ తెలిపింది. మారిన రూల్స్ ప్రకారం మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఐసీఐసీఐ సేవింగ్ అకౌంట్ తీసుకోవాలంటే మినిమమ్ బ్యాలెన్స్ రూ.50వేలు మెయింటైన్ చేయాలి. గతంలో ఈ పరిమితి రూ.10వేల వరకు మాత్రమే ఉండేది. ఇప్పుడు దాన్ని ఏకంగా ఐదు రెట్లు పెంచింది. సెమీ అర్బన్ కస్టమర్లకు కూడా రూ.5వేల నుంచి రూ.25వేలకు పెంచింది. ఇక రూరల్ కస్టమర్లకు కూడా రూ.2,500 నుంచి రూ.10వేలకు ఐసీఐసీఐ పెంచింది. ఈ రూల్ ప్రకారం మినిమమ్ బ్యాలెన్స్ మెయింటైన్ చేయకపోతే అదనపు బాదుడు తప్పదని ఐసీఐసీఐ తెలిపింది. మినిమమ్ బ్యాలెన్స్ లేకపోతే ఛార్జీలు వేయడాన్ని కొన్ని బ్యాంకులు ఈమధ్యే ఎత్తేశాయి. ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు అయిన ఎస్‌బీఐ 2020లోనే ఈ రూల్ తొలగించింది. ఈమధ్యే పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్ కూడా ఈ ఛార్జీలను తొలగించాయి. ఇప్పుడు ఐసీఐసీఐ ఓవరాక్షన్ తో కొత్త కస్టమర్లతో పాటు పాత వాళ్ళు కూడా ప్రభుత్వ రంగ బ్యాంకుల వైపు మళ్ళే అవకాశాలు ఉన్నాయి.

# జూబ్లీహిల్స్ కోసం అజారుద్దీన్ పైరవీ

## ప్రియాంకతో మాజీ క్రికెటర్ భేటీ



న్యూఢిల్లీ: మాజీ ఎంపీ మహ్మద్ అజారుద్దీన్ జూబ్లీ హిల్స్ అసెంబ్లీకి కాంగ్రెస్ టిక్కెట్ కోసం ఢిల్లీలో పైరవీలు చేస్తున్నారు. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీతో ఆయన భేటీ అయ్యారు. శుక్రవారం పార్లమెంట్‌లో ఆమెరె అజారుద్దీన్ కలిశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తనకు టిక్కెట్టు ఇవ్వాల్సిందిగా కోరినట్లు తెలుస్తోంది. ఈ టిక్కెట్టుకు ఆశావాహులు బాగా పెరిగిపోతుండటంతో, ఢిల్లీలో హైలెవల్లో ఆయన పైరవీలు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేశాను. అప్పుడున్న పరిస్థితుల్లో ఓడిపోయా. ఈసారి బైఎలక్షన్స్ లో తప్పకుండా విజయం సాధిస్తా అని అజార్ ధీమాగా చెబుతున్నారు. తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలని ప్రియాంకను కోరినట్టు సమాచారం. ప్రియాంక గాంధీ పార్టీ నాయకులతో చర్చిస్తానని చెప్పినట్టు తెలుస్తోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588